1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ

శుక్రవారం | అక్టోబర్13, 2023 | www.navatelangana.com

జిల్లా లీగల్ సెల్ ఇన్‌చార్జిగా దున్న లింగస్వామి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఎస్పీ నాయకులకు, కార్యకర్తలకు ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలను పరిష్కరించే దిశగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్న అడ్వకేట్ దున్న లింగస్వామిని లీగల్ సెల్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించాలని జిల్లా అధ్యక్షులు సమక్షంలో చర్చించిన రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. తనపై నమ్మకంతో ఈ జిల్లా స్థాయి ప్రమోషన్ ఇచ్చిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కేసీఆర్ పాలనలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారు

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రతి ఒక్కరు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కనగల్ మండలం రేగట్ట గ్రామానికి చెందిన 30 మందికిపైగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరీం పాషా, సింగిల్ విండో చైర్మెన్ వంగాల సహదేవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అయితగోని యాదయ్య, ఎంపీటీసీ, పాలకూరి పుష్ప వెంకటేశం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ కదారి కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ, ఎర్రోళ్ల సంజీవ, గోలి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టాప్రా ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

టాప్రా ఆధ్వర్యంలో నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవన్‌లో మ్యాక్సివిజన్ శ్రీ మహాలక్ష్మి కంటి ఆస్పత్రి వనస్థలిపురం హైదరాబాద్ వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించబడుతునట్లు టాప్రా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నూకల జగదీష్ చంద్ర, పందిరి శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

నవతెలంగాణ-మునుగోడు

అసైన్డ్ భూముల్లో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలను చేపడుతున్న కట్టడాలను ఆపాలని రెవెన్యూ పంచాయతీ అధికారులు నోటీసులు అందించినప్పటికీ నిలిపివేయకుండా నిర్మాణాలు చేపడుతున్నడంతో గురువారం మునుగోడు గ్రామ కార్యదర్శి ఎస్.మురళీమోహన్ జేసీబీ సాయంతో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనాలను ఉల్లంఘించి వ్యవసాయ సాగు కోసం ఉపయోగించాల్సిన అసైన్డ్ భూముల్లో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడం సరైంది కాదని నిర్వాహకులకు సూచించారు. నిర్మాణాలు ఆపాలని నోటీసులు ఇచ్చినప్పటికీ నిర్మాణ పనులు నిలిపివేయకుండా కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారనైనా సహించేది లేదన్నారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ కల్పన, బిల్ కలెక్టర్ మచ్చ గిరి, గ్రామపంచాయతీ సిబ్బంది దత్తు, సాయి కిషోర్, సుధాకర్, యాదగిరి తదితరులు ఉన్నారు.

సాగర్ ఎడమ కాల్వ నీటితో చెరువులు నింపాలని వినతి

నవతెలంగాణ-మిర్యాలగూడ

నాగార్జున సాగర్ ఎడమ కాల్వ నీటి ద్వారా ఆయకట్టులోని చెరువులు, కుంటలు నింపాలని గురువారం సమర్పించిన జిల్లా కలెక్టర్ కర్ణన్‌కు సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ మహబూబ్ అలీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ డ్యాం నిండి ఆయకట్టుకు నీళ్లు వస్తాయని నాట్లు వేశారని నేడు చెరువుల్లో, బావుల్లో నీరు అడుగంటి పోయాయని, పంట పొలాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గొలుసు చెరువులు అనేకం ఉన్నాయని తెలిపారు. మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పందిర్లపల్లి చెరువును నింపి ఆ చెరువు ద్వారా అప్పలమ్మచెరువు, గూడూరు, రుద్రారం గ్రామ రుద్రప్ప చెరువు నింపే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఇదే పద్ధతిలో చెరువులను నింపి రైతులను ఆదుకోవాలని కోరారు.

విద్యార్థులతో కీటకిటిలాడిన బస్టాండ్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

దసరా, బతుకమ్మ పండుగ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు, గురుకులలకు నేటి నుండి సెలవులు ప్రారంభం కానున్నాయి. దీంతో జిల్లా కేంద్రంలోని సంక్షేమ హాస్టల్‌లు, గురుకులాలలో చదువుకుంటున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులతో గురువారమే ఇంటికి బయలుదేరారు. ఈ విద్యా సంవత్సరంలో మొదటి విడత సెలవులు కావడంతో విద్యార్థులు ఎంతో ఆనందోత్సాహంలో మునిగిపోయారు. ఇంటికి బయలుదేరేందుకు బస్టాండ్‌కి వచ్చిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కిటకిటలాడింది. ప్రభుత్వం దసరా సెలవులు ఈనెల 25 వరకు ఇవ్వగా తిరిగి ఈ నెల 26వ తేదీన పాఠశాలలు పునర్ ప్రారంభం కానున్నాయి.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదువులో రాణించాలి

నవతెలంగాణ-తిరుమలగిరిసాగర్

విద్యార్థులు మంచి లక్ష్యాన్ని పెట్టుకొని చదువులో రాణించాలని ఎస్ఐ సురేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ చైతన్య, గ్రేట్ వే విద్యాసంస్థలలలో ఘనంగా బతుకమ్మ ముందస్తు వేడుకలు, ఎఫ్ఎ -2 ఎగ్జామ్స్ ఫలితాలలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డ్స్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ పాల్గొని ఎఫ్ఎ-2 ఎగ్జామ్స్ లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డు అందజేసి మాట్లాడారు. ముందస్తు బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోప్యాధ్యాయులు ఎల్.బ్రహ్మచారి, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, నాగయ్య శ్యామ్ సుంధర్‌రెడ్డి, వెంకన్న, బషీర్, ఆంజనేయులు, నరేష్, మంజుల, మోక్ష, సరిత, శోభారాణి, లక్ష్మి, మాధవి, జమీల, శ్రీలత, కల్పన, తనవీర్, సఫియా తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్య మృతి బాధాకరం

నవతెలంగాణ-చింతపల్లి



చింతపల్లి మండలం నెల్వలపల్లి గ్రామానికి చెందిన బుర్గు మల్లయ్య మృతి బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం మల్లయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బుర్గు మల్లయ్య మృతి పార్టీకి లోటు అని పేర్కొన్నారు. మల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పలువురు నాయకులు తదితరులు

రూ. 22.50 లక్షల నగదు సీజ్

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. గురువారం మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులకు 9 లక్షల నగదు పట్టుబడగా వన్ టౌన్ పోలీసులు రూ. 1.40 లక్షలు, అడవిదేవులపల్లి పోలీసులు రూ.1.11ల నగదును స్వాధీనం చేసుకొన్నారు. అదేవిదంగా ఆలగడప టోల్ గేట్ వద్ద రూరల్ ఎస్సై నర్సింహులు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా 11లక్షలు నగదు పట్టుబడినట్లు తెలిపారు. పోలీసులకు పట్టుబడిన నగదును మిర్యాలగూడ రిటర్నింగ్ అధికారి చెన్నయ్య కి అప్పగించగా ఆ మొత్తాన్ని సీజ్ చేశారు.

వాడపల్లి వద్ద రూ.90 వేలు పట్టివేత


దామరచర్ల : ఎన్నికల సందర్భంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా గురువారం రూ.90 వేలు పట్టుబడ్డాయి. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వాడపల్లి గ్రామ శివారులోని ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దులో వాహనాల తనిఖీ చేయుచుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వినుకొండ పట్టణానికి చెందిన పోకూరి శ్రీనివాసరావు కారులో హైదరాబాద్ వైపునకు వెళ్తుండగా, ఆపి తనిఖీ చేయగా అతని వద్ద రూ.90 వేల నగదు ఉన్నవి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్నందున అతని వద్ద గల నగదు స్వాధీన పరచుకుని వాటిని మిర్యాలగూడ రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు తెలిపారు.

రూ.7.3లక్షల నగదు పట్టివేత

నార్కట్‌పల్లి : ఏ లాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళుతున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.7,30,000 స్వాధీనపరుచుకున్నట్లు స్థానిక ఎస్సై సైదాబాబు పేర్కొన్నారు. గురువారం నార్కట్‌పల్లి పట్టణంలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వాహనాలను తనిఖీ చేస్తుండగా మండల పరిధిలోని తుమ్మలగూడెం గ్రామానికి చెందిన యానాల నర్సిరెడ్డి ఆరు లక్షల రూపాయలు, చిప్పలపల్లి గ్రామానికి చెందిన ఏషామ్మ లక్ష 30 వేల రూపాయలు ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా వారిని తనకి కార్యక్రమంలో భాగంగా వారికి తనిఖీ చేయగా వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని ఎస్సై పేర్కొన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని 50 వేల రూపాయలకు మించి ఎవరు కూడా నగదును ఆధారాలు లేకుండా తీసుకెళ్తే చట్ట విరుద్ధమని ఆయన హెచ్చరించారు.

అమ్మకానికి గురుకులం సీట్లు

- రూ. 30 నుంచి రూ.50 వేల వరకు వసూలు
- సీట్లను అమ్ముకుంటున్న ఉపాధ్యాయులు
- ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం



నవతెలంగాణ-మిర్యాలగూడ

పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. గురుకులాలలో పనిచేసే ఉపాధ్యాయులు సీట్లను అమ్ముకొని లక్షలు ఆర్జిస్తున్నారు. అక్రమాలపై విద్యార్థి, ప్రజా సంఘాలు ఫిర్యాదు చేసిన అధికారుల నుండి ఎలాంటి స్పందన లేదు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్లను అమ్ముకున్నట్లు కాల్ రికార్డులు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. విద్యార్థినిల తల్లిదండ్రుల నుండి ఉపాధ్యాయులు డబ్బులు డిమాండ్ చేసే కాల్ రికార్డులు వైరల్ అవుతున్నాయి. ఈ విషయంపై తెలంగాణ గిరిజన సంఘం నాయకులు ఉన్నత అధికారులకు ఆధారలతో సహా ఫిర్యాదు చేశారు. వివరాలకు వెళితే...మిర్యాలగూడ పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలోని ప్రిన్సిపాల్ శారద మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయురాలు పుష్ప ఇద్దరు కలిసి ఆ గురుకులంలో ఉన్న ఖాళీ సీట్లను అమ్ముకుంటున్నారు. ప్రతిభా ఆధారంగా గురుకులాలలో సీట్లు కేటాయిస్తున్నప్పటికీ విద్యా సంవత్సరం మధ్యలో వెళ్లిపోయిన విద్యార్థులు ఇలా స్థానంలో కొత్తవారిని భర్తీ చేస్తుంటారు. అన్ని అర్హతలు ఉంటేనే ఉన్నతాధికారుల అనుమతి మేరకు సీట్లను భర్తీ చేయాలి. కానీ ఆ గురుకుల పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులు అవినీతి అక్రమాలకు తెరలేపి వేలాది రూపాయలకు సీట్లను అమ్ముకుంటున్నారు. ఒక్కొక్క సీటును 30 నుంచి 50 వేల వరకు అనుకుంటున్నారు. ఇప్పటికే ఆ పాఠశాలలో మూడు సీట్లు అమ్ముకోగా మరో సీటు అమ్ముకొని తల్లిదండ్రుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్న కాల్ రికార్డ్ వైరల్ అవుతుంది. తుంగతుర్తిలో సీటు వచ్చినటువంటి 5 వ తరగతి విద్యార్థిని కే.అక్షర మిర్యాలగూడ బాలికల గురుకుల పాఠశాలలో బదిలీ చేయుటకు విద్యార్థిని తండ్రి కే.స్వామి ద్వారా ఉపాధ్యాయురాలు పుష్ప 33 వేల రూపాయలు అడిగిన విషయాన్ని ఫోన్ రికార్డులు వెలుగులోకి వచ్చాయి. నేరుగా తల్లిదండ్రులను డబ్బులు తీసుకొని సీట్లు కేటాయిస్తున్నట్లు స్పష్టం అవుతుంది. నేరుగా తల్లిదండ్రుల నుండి డబ్బులు తీసుకొని సీట్లు కేటాయిస్తున్నారని స్పష్టమవుతుంది. తాము చెప్పిన టైం లోపు డబ్బులు చెల్లిస్తేనే సీటు ఉంటుందని లేకుంటే వేరే వారికి కేటాయిస్తామని చెప్పి బలవంతంగా వసూలు చేస్తున్నారు. ఇందులో మ్యాథమెటిక్స్ టీచర్ పుష్ప భర్త కీలకంగా వ్యవహరించినట్లు విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గిరిజన సంఘం నాయకులు ఉపాధ్యాయులను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానం చెప్పడంతో పాటు పైగా పుష్ప భర్త పాఠశాల లోపలికి వచ్చి అంతే అమ్ముకుంటాము ఏం చేసుకుంటావో చేసుకో పో అని దబాయిస్తున్నట్లు గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు



ఈ విషయాన్ని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి నాయక్ రాష్ట్ర గురుకులం సెక్రటరీ డాక్టర్ నవీన్ నికోలాస్ దృష్టికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ జరిపించి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రకంగా గిరిజన గురుకుల పాఠశాలలో ప్రతి సంవత్సరం 7 లక్షల నుంచి 10 లక్షల వరకు సీట్ల నమ్మకం ద్వారా ప్రిన్సిపాల్ ఇతర సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

లైసెన్స్ ఆయుధాలు అప్పగించాలి

- కలెక్టర్ కర్ణన్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున లైసెన్స్ ఉన్న తుపాకులను వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆర్వీ. కర్ణన్, ఎస్పీ అపూర్వరావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్, ఎస్పీతో కూడిన స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించి లైసెన్స్ కలిగిన ఆయుధాలపై సమీక్షించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం లైసెన్స్ ఆయుధాలు కలిగిన ప్రతి ఒక్కరూ సంబంధిత పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని సూచించారు. బ్యాంక్ లలో రక్షణ, క్రీడా ఈవెంట్‌లు నిమిత్తం తప్ప మిగతా వ్యక్తులు తమ ఆయుధాలు డిపాజిట్ చేయాలని సూచించారు. ఆయుధాలు, డిపాజిట్ చేయని వారిపై ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను పాటించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం పర్యవేక్షకులు కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులపై జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు

జిల్లాలో పోలీస్, ఎఫ్ఎస్‌టీ సర్వెలెన్స్ టీమ్‌ల ద్వారా తనిఖీలలో తగిన ఆధారం లేకుండా తీసుకు వెళుతున్న నగదును స్వాదీనం చేసుకున్న రూ.50 వేలకు మించి నగదు, ఇతర వస్తువులపై పరిశీలించి విడుదల చేసేందుకు జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీ పని చేస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆర్వీ.కర్ణ న్ తెలిపారు. గురువారం ఎస్పీ అపూర్వరావు, జిల్లా గ్రీవెన్స్ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయిలో పోలీస్, సర్వెలెన్స్ బృందాలు స్వాదీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల విడుదల చేసేందుకు వచ్చిన పిర్యాదులు, దరఖాస్తులను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చైర్మెన్‌గా ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలిస్తుందని, ఈ కమిటీలో జిల్లా ట్రెజరీ అధికారి సభ్యులుగా, జిల్లా సహకార అధికారి కన్వీనర్‌గా కమిటీ, జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేస్తుందన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ ప్రతి రోజు సమావేశం జరిపి ఆధారాలు లేకుండా పట్టుబడిన నగదు, వస్తువుల స్వాధీనంపై పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఎన్నికల కోడ్ ముగిసే వరకు రూ. 50 వేల వరకే నగదు తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుందని ఆయన తెలిపారు. ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకొని వెళ్లవద్దని పేర్కొన్నారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు నగదును తీసుకెళ్తున్న వారు సరైన పత్రాలతో నగదును తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఆధారాలు లేక సీజ్ అయిన నగదు విషయమై అప్పీలు, ఆధారాలు పొంది దరఖాస్తు చేసుకోవడానికి జిల్లా పరిషత్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్,జిల్లా సహకార అధికారి కిరణ్ కాంటాక్ట్ నెం. 9100115650 సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, డీసీఓఆర్ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పాత్రికేయులపై దాడులు హేయమైన చర్య

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత్రికేయులపై దాడులు పెరిగాయనీ, న్యూస్ క్లిక్‌పై జరిగిన దాడిని ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని, పాత్రికేయులపై దాడులు హేయమైన చర్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి అన్నారు. గురువారం. మండల పరిధిలోని ఏపీ లింగోటం గ్రామంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు ఎస్సార్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వంపై ప్రశ్నించే పత్రికలపై దాడులు పెరిగాయని స్వేచ్ఛ బావ ప్రకటన చేస్తున్న నేపథ్యంలో పాత్రికేయుల గొంతును నొక్కుతున్నాయన్నారు. న్యూస్ క్లిప్ ఛానల్ ఢిల్లీలో రైతులు చేస్తున్నా ధర్నాకు మద్దతుగా, అదేవిధంగా మణిపూర్‌లో కూడా కండనను ప్రశ్నిస్తూ రాస్తున్న పత్రికను గొంతు నొక్కుతున్నారని, పత్రికా స్వేచ్ఛను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా 28 రాజకీయ పార్టీలపై వ్యతిరేకంగా సిద్ధమయ్యాయి. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కూడా క్రమేపి బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి లొంగిపోయి సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీట్ల సర్దుబాటుపై ప్రాథమిక దశలో ఉన్నాయి. కొద్దిరోజుల్లో అధికారికంగా సీట్ల సర్దుబాటుపై స్పష్టత రానున్నది పొత్తులు కుదిరిన కుదరకపోయినా నకరేకల్ గడ్డపైన ఎర్రజెండా ఎగరవేయటం కాయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి చెరుకు పెద్దులు వైస్ ఎంపీపీ కల్లూరు యాదగిరి, మండల మాజీ కార్యదర్శి గాలి నరసింహ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి బయన్న, కొప్పు శ్రవణ్, జాల యాదమ్మ, ఆమనగంటి ఐలయ్య, నన్నేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం

నవతెలంగాణ-చండూరు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూ రైతులను మోసం చేస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండశ్రీశైలం అన్నారు. గురువారం చండూరు మండల కేంద్రంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ..ప్రభుత్వ భూములు కలిగిన పేద రైతులకు, రుణమాఫీ అయిన రైతులకు తిరిగి పంట రుణాలివ్వాలన్నారు. అసైన్డ్, ఇనాం భూములకు కలిగిన పేద రైతులకు తిరిగి పంట రుణం ఇవ్వకుండా, బ్యాంకర్లు నిరాకరిస్తున్నారని తెలిపారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖరీఫ్ ధాన్యం మార్కెట్ కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యలపై ప్రభుత్వం స్పందించి రైతాంగన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, సీనియర్ నాయకులు చిట్టిమల్ల లింగయ్య, నాయకులు కొత్తపల్లి నరసింహ, గౌస్య బేగం, బల్లెం స్వామి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే మరో పోరాటం తప్పదు

- సీహెచ్.లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ఆశా వర్కర్లకు 18వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, ఇతర న్యాయమైన సమస్యల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 15 రోజుల నిరవధిక సమ్మె సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ శ్రీనివాసరావు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మరో పోరాటం తప్పదని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) జిల్లా గౌరవ అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ హెచ్చరించారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నల్లగొండ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షురాలు డీ.మహేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొని ఎంతో ధైర్యంగా ఐక్యంగా వీరోచిత పోరాటం చేసిన ఆశలకు అభినందనలు తెలిపారు. సమ్మెలో భాగంగా 9న చలో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ధర్నా సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ శ్రీనివాస్‌రావు ఆశా వర్కర్ల డిమాండ్లు పరిష్కరించేందుకు ముగ్గురు ఐఏఎస్‌లతో కమిటీ వేస్తామని, సమస్యలు సమగ్రంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి పరిష్కారాన్ని కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల కోడ్ వచ్చినందున ఆశ వర్కర్ల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశామని ప్రభుత్వం మోసం చేస్తే మరో పోరాటానికి ఆశ వర్కర్లు సిద్ధమవుతారని హెచ్చరించారు. అనంతరం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తవిటి వెంకటమ్మ మాట్లాడుతూ టీబీ స్పూటం డబ్బాలను ఆశాలతో మోపించే పద్ధతి మానుకోవాలని డిమాండ్ చేశారు. పారితోషకాలు లేని పనులను ఆశ వర్కర్లు చేయవద్దన్నారు. ఆశ వర్కర్ల పనిబారం తగ్గించాలని జాబ్ చార్ట్ రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య జిల్లా నాయకులు భీమగాని గణేష్, ఆశ యూనియన్ జిల్లా నాయకులు రమావత్ కవిత, వసంత, శైలు, టీ. పార్వతమ్మ, ఎస్కే. సలీమా, కే. సంధ్యారాణి, ఎం. పుష్పలత, ఎస్.జయమ్మ సునీత, బీ. అనూష, బీ.నిర్మల, మమత, పద్మ, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థరైటిస్‌ను జీవనశైలి ద్వారా నియంత్రించవచ్చు

- ఎంవీఎన్ ట్రస్టు సేవలు అభినందనీయం
- డాక్టర్ మల్లు అరుణ్ కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ఆర్థరైటిస్ ఉన్న వారు జీవనశైలి ద్వార కూడా నియంత్రించవచ్చునని ఆర్థోసర్జన్, మోకాళ్ల చిప్ప మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ మల్లు అరుణకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఐఎంఎ, నల్లగొండశాఖ సహకారంతో సత్యావతి మల్టీస్పెషాలిటి వైద్యశాలలో ఉచిత ఆరోగ్య శిభిరం నిర్వహించడాన్ని ఎంవీఎన్ ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీళ్లవాపు, మోకాళ్ల నొప్పులు, జాయింట్ పెయిన్ నొప్పులున్నవారు జీవనశైలి, ఆహార అలవాట్లతో కూడా నియంత్రించవచ్చునని, మందులు నొప్పులకు తాత్కలిక ఉపశమనమని ఇవి ఎక్కువ కాలం వాడకూడదని చెప్పారు. ప్రతిరోజు నడక, సైక్లింగ్, స్విమ్మింగ్‌తో కూడా ఉపయోగముంటుందన్నారు. అలాగే ఈనొప్పులున్న వారు ఎక్కువ దూరం నడవడం, మెట్లు ఎక్కడం, దిగడం చేయవద్దని సలహా ఇచ్చారు. ఈ నొప్పులతో బాధపడుతూ 50 సంవత్సరాలపై బడిన వారు హై ఎనర్జీని ఉపయోగించే పనులు చేయకూడదని చెప్పారు. కీళ్ల వాతమును ప్రారంభంలో గుర్తించనట్లయితే మందులతో నయం చేసుకోవచ్చని ఆపరేషన్ అవసరం రాదన్నారు. మోకాళ్ల చిప్ప మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న వారు 3, 4 వారాలలో తన పనులను తానే చేసుకోవచ్చని తెలిపారు. ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దన్నారు.ఎంవీఎన్ ట్రస్టు కార్యనిర్వాహక కార్యదర్శి పీ.నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ జాయింట్ పెయిన్స్ దినోత్సవం సందర్భంగా ఉచిత ఆరోగ్య శిభిరంలో మోకాళ్ల, కీళ్ల నొప్పులు ఇతర ఎముకల అరుగుదలతో నొప్పులతో బాదపడుతున్న 100 మందికి ఉచితంగా ఎక్స్‌రే, బీఎండీ స్కాన్ మొదలుగు పరీక్షలు చేసి తగుసలహాలు సూచనలు ఇచ్చారని చెప్పారు. ఇవే కాకుండా రెగ్యులర్‌గా ప్రతి నెల మూడో ఆదివారం షుగర్, బీపీ, పక్షవాతం, మూర్ఛ రోగులకు డాక్టర్ గోపాలం శివన్నారాయణ పర్యవేక్షణలో గత 8 సంవత్సరాల నుండి మందులు పంపిణి చేస్తున్నామని, డిసెంబర్ 5న అమరజీవి మల్లు వెంకట నర్సింహరెడ్డి వర్ధంతి సందర్భంగా రెగ్యులర్‌గా డాక్టర్ మల్లు అరుణ్ మోకాళ్ల చిప్ప మార్పిడి ఉచితంగా చేయడాన్ని అభినందించారు. ఈ ఆపరేషన్, వైద్యశిభిరం నిర్వహించడానికి సత్యవతి మల్టీస్పెషాలిటి వైద్యశాల యాజమాన్యమును డాక్టర్ రాంమనోహర్ సూరేపల్లి, డాక్టర్ చైతన్యలను అభినందించారు. ఎం వీఎన్ విజ్ఞాన కేంద్రం చేస్తున్న సేవలను ఉమ్మడి జిల్లా ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ వైద్యశిభిరంలో డాక్టర్ చైతన్య, ఇతర సిబ్బంది బ్రహ్మాజీ, ప్రవీన్, వైద్యశాల సిబ్బంది పాలొన్నారు.

ప్రచార వ్యయానికి వ్యయ నియంత్రణ పర్యవేక్షణ కమిటీ ద్వారా నమోదు

- కలెక్టర్ కర్ణన్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

రాష్ట్రంలో నిర్వహించనున్న అసెంబ్లీ సాధారణ ఎన్నికలలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచార వ్యయంను ఎన్నికల వ్యయ నియంత్రణ పర్యవేక్షణ కమిటీ ద్వారా నమోదు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కర్ణన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఎన్నికలలో ర్యాలీలు, సభలు సమావేశాల్లో వ్యయం చేసే వాహన ఖర్చులు, ఫంక్షన్ హాల్‌లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్ తదితర అంశాలపై చర్చించి ధరను ఖరారు చేశారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఖర్చును సంబంధిత రేట్‌ల ప్రకారం లెక్కించి వారి వ్యయంలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సీ విజిల్ ఆప్ ద్వారా ఫోటో, వీడియోల ద్వారా పిర్యాదు చేయవచ్చని తెలిపారు. పిర్యాదులు పరిశీలించి 100 నిమిషాల్లో పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. పిర్యాదు దారు పేరు రహస్యంగా ఉంటుందని చెప్పారు. కొత్తగా శంకుస్థాపనలు, ప్రారంభంలు, కొత్తగా సంక్షేమ పథకాల పంపిణీ చేయరాదని తెలిపారు. అదే విధంగా తనిఖీల సంబంధించి అధిక మొత్తంలో నగదు, వస్తువులు సరైన ఆధారాలు లేకుండా తీసుకు వెళితే సీజ్ చేసిన వాటిని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పీల్ చేసుకోవాలని, జెడ్పీ సీఈఓ చైర్మెన్‌గా, డిసిఓ కన్వీనర్‌గా, డీటీఓ సభ్యులుగా జెడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కమిటీ ప్రతి రోజు నగదు స్వాదీనంపై ఎన్నికల నిమిత్తం తీసుకు వెళ్ళటం లేదని సరైన ఆధారాలు చూపితే రిలీజ్ చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పీ.నర్సిరెడ్డి సీపీఐ(ఎం), పిచ్చయ్య(బీఆర్ఎస్), లింగ స్వామి(బీజేపీ), మల్లికార్జున్(టీడీపీ), గౌస్ మోహి యుద్దీన్(ఎంఐఎం), శంకర్ నాయక్, (కాంగ్రెస్), వీ.యాదగిరి(బీఎస్పీ), కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు కృష్ణ మూర్తి, ఎన్నికల డీటీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చైర్మెన్లకు ఘనసన్మానం

నవతెలంగాణ-తిరుమలగిరి

బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ సభ్యునిగా ఎన్నికైన కందుకూరి లక్ష్మయ్యకు, తిరుమలగిరి మున్సిపాలిటీ గ్రంథాలయ చైర్మెన్‌గా నియమించిన మోడెపు సురేందర్‌ను బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మున్సిపాలిటీ చైర్మెన్, మార్కెట్ చైర్మెన్, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పీఏసీఎస్ చైర్మెన్, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



జూనియర్ అసిస్టెంట్ల నిరసన

నవతెలంగాణ-ఆత్మకూరుఎస్

హన్మకొండ జిల్లా దామెర మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఇజ్జగిరి సతీష్ బుధవారం రాత్రి జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఆత్మహత్య చేసుకున్నారు.దీనికి నిరసనగా ఆత్మకూర్ఎస్ మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ రికార్డు అసిస్టెంట్ ఓఎస్ లు బ్లాక్ రిబ్బన్ జేబుకు పెట్టి నిరసన వ్యక్తం చేశారు.సూర్యాపేట జిల్లా అధ్యక్షులు మల్లయ్య మాట్లాడుతూ రెండు నెలల నుండి జీతాలు లేక, కుటుంబం గడవక, ఆర్థిక పరిస్థితులే కారణమన్నారు. అతని ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని కలగజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జహంగీర్, సతీష్, సైదులు కుసుమ, కారుణ్య,మహేష్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.



నియోజకవర్గ అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

నవతెలంగాణ-నేరేడుచర్ల

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తనను గెలిపిస్తారని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం నేరేడుచర్ల పట్టణంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొణతం సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన బూత్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు.జనం కోసం పనిచేసేందుకు తాను రాజకీయాలకు వచ్చానని, తెలంగాణ 9 సంవత్సరాలలో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్, రోడ్లు, వ్యవసాయ రంగంతో పాటు అన్ని రంగాలలో తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. నేరేడుచర్ల పట్టణ అభివృద్ధికి సుమారు రూ.70 కోట్లు, మరో 25 కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చానని తెలిపారు.డంపింగ్‌యార్డులో వాసన రాకుండా మరో రూ.4 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. నేరేడుచర్ల మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా మారుస్తానని హామీ ఇచ్చారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురించి మాట్లాడుతూ ఆయనకు, ఆయన భార్యకు సీట్లు కావాలి, పదవులు కావాలని ఎద్దేవా చేశారు. ఉత్తం కుమార్ రెడ్డి నేరేడుచర్ల అభివృద్ధికి చేసింది



ఏమీ లేదన్నారు.ఆయన గ్రామాల్లో తిరగాలంటే సిగ్గు పడుతున్నారని, అనామకుడిగా వచ్చిన ఆయన కోట్ల రూపాయలు సంపాదించాడని అన్నారు. అభివృద్ధి పనులు చేస్తుంటే ఆయన అడ్డుకొని కోర్టులో కేసులు వేస్తున్నారని విమర్శించారు. ఆయనకు దళితబంధు అంటే ఇష్టం లేదని, దళితుల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు.50 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానని ఉత్తంకుమార్ రెడ్డి పిచ్చిలో ఉన్నాడని, గెలవకపోతే రిటైర్మెంట్ అవుతారా అంటూ ప్రశ్నించారు. తాను నిరంతరం ప్రజలు మధ్య ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నానని తెలిపారు. పార్టీలో సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకోవాలని కార్యకర్తలకు సూచించారు.ఎమ్మెల్యే సమక్షంలో మండలంలోని పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. నాగార్జునసాగర్ ఆయకట్టుకు వరుసగా నీళ్ల ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కాళేశ్వరం నీళ్ల గరిడేపల్లి మండలం కుతుబ్‌షా పురం గ్రామానికి వస్తున్నాయని తెలిపారు.నియోజకవర్గంలో మూడు రోడ్లకు అనుమతి తెచ్చినట్లు చెప్పారు. పార్టీలో పని చేసిన వారికి భవిష్యత్ తప్పక ఉంటుందన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ చందమల్ల జయబాబు, మార్కెట్ చైర్మెన్ నాగండ్ల శ్రీధర్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరు సైదులు, గ్రంథాలయ చైర్మెన్ గుర్రం మార్కండేయ, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరి బండి సురేష్ బాబు, పట్టణ ఎన్నికల ఇన్‌చార్జి మనస్సూర్అలీ, బీఆర్ఎస్ నాయకుడు జే వి ఆర్, మున్సిపల్ కౌన్సిలర్లు, అన్ని బూతుల అధ్యక్షులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు

నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ బదిలీ అయిన నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుండి అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వరరావుకు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలను ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.



సోమవారం ప్రజావాణి రద్దు

- కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా అధికారులు వారికి కేటాయించిన విధులలో పూర్తిగా నిమగ్నమై ఉన్నందున వచ్చే ఈ నెల 16 సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకట్రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు విషయాన్ని గమనించి సహకరించగలరని పేర్కొన్నారు.

ప్రతికార్యకర్తా సైనికుల్లా పని చేయాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌ను మూడవసారి భారీ మెజారిటీతో గెలిపించుకోవడానికి ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంకేపల్లి రఘునందన్‌రెడ్డి కోరారు. గురువారం ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆదేశానుసారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేను అత్యధిక మెజారిటీయే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు.హ్యాట్రిక్ దిశగా ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని కోరారు. అదేవిదంగా ఈ నెల 29 తారీకు సీఎం కేసీఆర్ బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు.బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలుప్రజాప్రతినిధులు,మున్సిపాలిటీ చైర్‌పర్సన్,మార్కెట్ చైర్‌పర్సన్, ఎంపీపీ, జెడ్పీటీసీ, పీఏసీఎస్ చైర్మెన్, గ్రామసర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్నేహలత, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రవీందర్, పిఎసిఎస్ చైర్మన్ చంద్రశేఖర్ కౌన్సిలర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

నాలుగున్నరేండ్లలో అభివృద్ధి చేసి చేశాం



నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 40ఏండ్లలో జరగని అభివృద్ధి కార్యక్రమాలు కార్యక్రమాలు నాలుగున్నర ఏండ్లలోనే చేపట్టామని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు గురువారం పట్టణంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన హుజూర్‌నగర్, నేరేడుచర్ల మండలాల బూత్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు.4000 కోట్ల రూపాయలతో నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు అభివృద్ధి కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.ప్రతి ఒక్కరూ 100 ఓటర్లను కలిసి పార్టీ చేసిన పనులను వివరించాలన్నారు.అక్టోబర్ 31న జరిగే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు.రాబోయే ఎన్నికల గురించి ఎన్నికల గురించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జేవీఆర్, ఇమ్రాన్, గురువయ్య, బ్రహ్మారెడ్డి, పార్టీ అధ్యక్ష కార్యదర్శులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, బెల్లంకొండ అమర్,కౌన్సిలర్లు అట్లూరి మంజులశంభయ్య, కొమ్ము శ్రీను, ఓరుగంటి నాగేశ్వరరావు,దొంగరి మంగమ్మ, గుండాఫణికుమారి, ములకలపల్లి రాంబాబు,సీహెచ్.సౌజన్య జయబాబు, గణతం సత్యనారాయణరెడ్డి, సీహెచ్ సైదులు,అప్పిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ నాదెండ్ల శ్రీధర్, జిల్లా మార్కండేయ,పి.రాజేష్, భాష లలిత, నాగవేణి, నారాయణ, అలక సరిత సైదిరెడ్డి, సులోచన, కేఎల్ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతన్నను వెంటాడుతున్న విద్యుత్ కోతలు

నవతెలంగాణ-పాలకవీడు

మండలపరిధిలోని అలింగాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రైతాలు అష్టకష్టాలు పడుతున్నారు.అప్రకటిత విద్యుత్ కోతలు తమ ప్రాణం మీదికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అలంగాపురం ఫీడర్ సుదీర్ఘకాలంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో బోరు బావులకు విద్యుత్ అందక నోటి కాడికి వచ్చిన పంటలు ఎండి పోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల కింద కొందరు రైతులు పురుగుమందు డబ్బాలు చేత పట్టుకొని విద్యుత్ కేంద్రంలోకి ప్రవేశించి నిరసన తెలిపారు. తమకు ఇచ్చే విద్యుత్ లైన్‌పై అధికలోడు వేయడం వలన సమస్య వస్తుందని రైతులు చెబుతున్నారు.గురువారం మరోసారి కరెంట్ ఆపరేటర్‌తో వాగ్వివాదానికి దిగి అధికారులు రావాలని డిమాండ్ చేశారు. లేకపోతే తమ పంటలు నిలువునా ఎండిపోయి అపార నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.గతవారం అధికారులు వచ్చి తాత్కాలికంగా విద్యుత్ కోతలు లేకుండా చేసినా, తిరిగి మూడు రోజులకే పునరావృతమైందని వాపోయారు. అధికారులు స్పందించి తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



తప్పులు పోస్టులు పెడితే గ్రూపు అడ్మిన్లదే బాధ్యత

నవతెలంగాణ-నేరేడుచర్ల

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే అడ్మిన్‌లతో పాటు పెట్టిన వారిపై చర్యలు తప్పవని నేరేడుచర్ల ఎస్సై పరమేష్ గురువారం హెచ్చరించారు.ఎన్నికలు సమీపిస్తున్న వేళ సోషల్ మీడియాలో వాట్సాప్ ఫేసుబుక్, ట్విట్టర్ గ్రూపులపై,ఇతర వ్యక్తులు గాని, పార్టీలను రెచ్చగొట్టే విధంగా కించపరిచే విధంగా, అవమానపరిచే విధంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు, తీసుకుంటామని గ్రూప్ అడ్మిన్లందరూ మీ గ్రూపులలోని సభ్యులు గురించి తెలుసుకొని పై విధమైన చర్యలకు పాల్పడే అవకాశముంటే అలాంటి వారిని గ్రూప్ నుంచి తొలగించాలన్నారు.

ప్రభుత్వ సంక్షేమపథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-మద్దిరాల

తెలంగాణ ప్రభుత్వం అందించిన ప్రతి సంక్షేమ పథకాలు ప్రజలకు అర్థమయ్యేటట్టు తీసుకెళ్లాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎస్ఎ రజాక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.గురువారం మండల కేంద్రంలోని నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.అన్ని గ్రామాల్లోని బూత్ లెవల్ నాయకులు రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మన పార్టీ అభ్యర్థి గాదరి కిశోర్ కుమార్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, గుడ్ల వెంకన్న,దుగ్యాల రవీందర్‌రావు,శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఎస్‌లో డెంగ్యూ, టైఫాయిడ్ టెస్టులు హాస్పిట్‌లో లేవని నిరసన

నవతెలంగాణ-గరిడేపల్లి

మండలకేంద్రంలోని పీఎస్‌లో డెంగ్యూ, టైపాయిడ్ టెస్టులు లేవని,దీంతో రోగులు ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యాకూబ్ అన్నారు. ఈవిషయమై గురువారం పీఎస్ ముందు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు.హాస్టల్ వ్యాప్తంగా వైరల్ ఫీవర్‌తో ప్రజలు ఇబ్బంది పడుతూ డెంగూ, మలేరియా, టైఫాయిడ్ వంటి అనేక రోగాలతో ప్రజలు ఇబ్బందులు పడతున్నారని,వారిని పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా సెంటర్ నుంచి కెమికల్ ఒక వ్యక్తి తీసుకొస్తే మళ్లీ వారానికి రిపోర్టు వస్తాయని, ఇది సరికాదన్నారు.10 నిమిషాలలో రిజల్ట్స్ ఇస్తుంటే ప్రభుత్వం హాస్పటల్‌లో వారానికి ఒకసారి ఇవ్వడం మూలాన ప్రజలు అనేక ఇబ్బందులు పడతున్నారని తెలిపారు. పల్లె దవాఖానాలో ఉచితంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని మాయ మాటలు చెప్పిన ప్రజలు నమ్మే పరిస్థితులో లేరన్నారు. వెంటనే పీఎస్ఎల్‌లో డెంగ్యూ, టైఫాయిడ్ కు సంబంధించిన కెమికల్స్‌ని వెంటనే రిపోర్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కనీసం జనరేటర్ లేకపోవడంతో రోగులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు24 గంటలు స్టాప్ నర్సులు, ఏఎన్ఎమ్‌లు, వాచ్‌మెన్‌లు ఉండేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో గొల్లపల్లి శ్రీనివాస్, ఎస్‌కె హుస్సేన్‌బి. వెంకయ్య, నాగమ్మ, సైదమ్మ, లక్ష్మీరాములునాయక్, జగదీష్‌నాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌కు చింతకాయల రాజీనామా

నవతెలంగాణ-మునగాల

మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులు బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు చింతకాయల నాగరాజు ఆ పార్టీ కి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీలో కష్టపడి పని చేసినా తనకు కనీస గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.2018లో ఎమ్మెల్యే గెలుపు కోసం ఎంత గానో కృషిచేశానని చెప్పారు.2019లో తనకు మునగాల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా టికెట్ ఇచ్చి ఆ తర్వాత నన్ను పోటి నుంచి అన్యాయంగా తప్పించారని చెప్పారు.తదనంతరం పార్టీలోకి వచ్చిన నాయకులు తనను పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. పార్టీలో ఎలాంటి పదవులు ఇవ్వక పోవడం బాధకలిగించిందన్నారు.ఇటీవలకాలంలో ఇష్టానుసారంగా ఇచ్చిన బీసీ లోన్ల విషయంలో తీవ్ర మనస్తాపానికి గురైయ్యానని చెప్పారు.తనకు జరిగిన అన్యాయాన్ని కోదాడలోని పార్టీ పెద్దలకు ఎన్నిసార్లు చెప్పుకున్నా పట్టిం చుకునే దిక్కే లేదన్నారు.కొన్నాళ్ళుగా పార్టీలో విసిగిపోయి చివరకు రాజీనామా చేయాలనే నిర్ణయానికి వచ్చానని చెప్పారు.



విద్యుత్‌షాక్‌తో హెల్పర్ మృతి

నవతెలంగాణ-నేరేడుచర్ల

విద్యుత్ షాక్ తో గ్రామ విద్యుత్ హెల్పర్ మృతి చెందిన సంఘటన మండలంలోని ఫత్తేపురం గ్రామంలో చోటుచేసుకుంది.ఎస్సై పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మచ్చ కృష్ణ తండ్రి సోములు(38)ఫత్తేపురం గ్రామంలో విద్యుత్ హెల్పర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఫత్తేపురం గ్రామ శివారులో 11 కేవీ కరెంట్ స్తంభం ఎక్కి జంపర్ కలుపుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాదరికిశోర్‌కుమార్‌ను గెలిపించుకుంటాం



నవతెలంగాణ-తిరుమలగిరి

తుంగతుర్తి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజల వద్దకు వెళ్లి అర్థమయ్యే విధంగా ప్రచారం చేసి మూడవసారి మళ్లీ ఎమ్మెల్యే గాదరికిశోర్‌కుమార్‌న గెలిపించుకుంటామని తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ కొమ్మిని స్రవంతి సతీష్‌కుమార్ అన్నారు.గురువారం మండలకేంద్రంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు.ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ పదేండ్ల కాలంలో నియోజకవర్గంలో దాదాపుగా 6,500 కోట్ల రూపాయలకు పైగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మనసులో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకున్నారన్నారు.నిత్యం ప్రజలతో ఉంటూ కార్యకర్తలను, నాయకులను కాపాడుకుంటూ, ఆదుకుంటూ ప్రజారంజక పాలన సాగించారన్నారు. దళితులు ఆర్థికంగా స్థిరపడాలని తిరుమలగిరి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 2500 కుటుంబాలకు కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున అందించి వారు వ్యాపారం చేసుకునే విధంగా దోహదపడ్డారన్నారు.దళితులకే కాకుండా సబ్బండవర్గాలకు సంక్షేమ పథకాలతో చేయూతనందించారన్నారు. తుంగతుర్తి వరప్రదాయాని కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను తీసుకొచ్చి ఏండ్ల తరబడి బీడులుగా ఉన్న నేలలను తడిపి రైతుల కళ్ళలో ఆనందాన్ని నింపారన్నారు. 225438 ఎకరాల భూమి సాగులోకి తీసుకొచ్చారన్నారు.భూమి మోయలేని పంట దిగుబడి ఇచ్చే విధంగా కృషి చేసి, పండిన పంటలను కొనుగోలు కేంద్రాల ద్వారా మార్కెట్లను విస్తరించి వ్యాపారం వృద్ధి చేశారని ప్రభుత్వ పథకాలు పేదలందరికీ అందించారన్నారు. ప్రజల మనిషిని మరోసారి గెలిపించుకోవడానికి నియోజకవర్గ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.65 ఏండ్లలో జరగని అభివృద్ధిని పదేండ్లలో చేసి చూపించిన గాదరి ప్రగతిని ప్రతి గడపకు వెళ్లి అర్థమయ్యేలా తెలియపరచి తుంగతుర్తి గడ్డపై గులాబీజెండా యాట్రిక్ ఎగరవేయడంలో ప్రధాన భూమిక పోషిస్తామన్నారు.

పాఠశాలకు డెస్క్ బెంచీలు బహూకరణ

నవతెలంగాణ-చిలుకూరు

పాఠశాలకు డెస్క్ బెంచీలు బహూకరణ చేయడం హర్షించదగ్గ విషయమని ఆచార్యులగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం తేజ రామ్ అన్నారు . గురువారం మండలంలోని ఆచర్లగూడెం గ్రామ నివాసి మొగిలిచర్ల రవి సీఐ ఆఫ్ పోలీస్ హైదరాబాద్ తన సొంత గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌కు బహూకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.సొంత ఊరును సొంత పాఠశాలను గుర్తు చేసుకుంటూ తన ఊరికి ఏదో ఒక ముఖ్యమైన మంచి పని చేయాలనే ఉద్దేశంతో పాఠశాలలో డెస్క్ బెంచీలు లక్ష రూపాయల విలువ గల వస్తువులను బహుకరించడం హర్షించదగ్గ విషయం అన్నారు అనంతరం సిఐ దంపతులను పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పీఎస్ పాఠశాల హెచ్ఎం సురగాని లింగయ్య, తోటి ఉపాధ్యాయులు టి.జనార్దన్, దొంగరి వెంకటేశ్వర్లు,విజయనిర్మల, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సారా అక్రమ తయారీదారులకు శిక్షలు తప్పవు

- ఎక్సైజ్ సీఐ నాగార్జున్‌రెడ్డి

నవతెలంగాణ-హుజూర్‌నగర్



నాటుసారా అక్రమ తయారీ దారులకు, నల్లబెల్లం క్రయ విక్రయ దారులకు శిక్షలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. గురువారం సర్కిల్ పరిధిలోని మఠంపల్లి మండలం కొత్తతండాలో దాడులు నిర్వహించి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.సారా తయారు చేస్తున్న భూక్యాపద్మ, భూక్యా విజయలను హుజూర్‌నగర్ కోర్టులో హాజరు పరచగా వారిని సబ్‌జైలుకు తరలించడం జరిగిందన్నారు.గతంలో వీరిపై కేసులు ఉన్నాయన్నారు.ఇదే తండాలో 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు.ఈ దాడుల్లో దివ్య వెంకన్న, జగన్మోహన్‌రెడ్డి,సిబ్బంది రవి, నాగరాజు, నాగరాజు పాల్గొన్నారు

'మేరీమదర్'లో బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-తుంగతుర్తి

బతుకమ్మ అంటే ప్రకృతిని ప్రేమించే పండుగ అని, ప్రకృతిని రక్షించుకోవడం ద్వారా మన భవిష్యత్ తరాలు బాగుంటాయని మేరీ మదర్ పాఠశాల ప్రిన్సిపాల్ మేరి విజ్జి అన్నారు.గురువారం పాఠశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించి మాట్లాడారు.విద్యార్థులు బతుకమ్మను పేర్చి,బతుకమ్మ ఆటపాటలతో అలరించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ అలేసియా, సిస్టర్ హెలెన్, సిస్టర్ జ్యోతి, సిస్టర్ మరియ, స్టాఫ్ సెక్రెటరీ అనిత, అసిస్టెంట్ సెక్రెటరీ అశోక్, సతీష్ వీరమల్లు నాగరాజు మహేష్ నబి సాయి కృష్ణ సుకన్య,సంధ్య, సంధ్యారాణి, ఉమ, సఫియా, నసీమా, లావణ్య యమున, జానకి, మంజుల పాల్గొన్నారు.

నాగారం: మండలపరిధిలోని అన్ని గ్రామాల ప్రభుత్వప్రయివేట్ పాఠశాలలలో గురువారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు.శుక్రవారం నుండి రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడంతో ముందస్తుగా పాఠశాలల్లో విద్యార్థినులు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా బతుకమ్మలు పేర్చి ఆటా పాటలతో గౌరవాన్ని మొక్కుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో...

ముందస్తు బతుకమ్మ సంబురాలు

పెన్‌పహాడ్: మండలపరిధిలోని అనంతారం గ్రామంలోని అరబిందో మాత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ సంబురాలను పాఠశాల ప్రిన్సిపాల్ షేక్‌మస్తాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు తంగేడు, గునుగు, బంతిపూలతో బతుకమ్మలను పేర్చి అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ అంటే పువ్వులను దైవంగా ఆరాధించే పండుగ అన్నారు.బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండీఆర్, ఆర్కిడ్ పాఠశాలలలో బతుకమ్మ వేడుకలు

హుజూర్‌నగర్ :పట్టణంలోని ఎండీఆర్, ఆర్కిడ్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా రంగురంగుల పూలతో విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి సంబురాలు నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా ఎండీఆర్ పాఠశాల కరస్పాండెంట్ మేరెడ్డి దామోదర్‌రెడ్డి,ఆర్కిడ్ స్కూల్ కరస్పాండెంట్ కరస్పాండెంట్ గెల్లి రవి,ప్రిన్సిపాల్ నలబోలు భూపాల్‌రెడ్డి మాట్లాడారు.పండుగలు వాటి ప్రాముఖ్యత- మన సంస్కృతి సంప్రదాయాల గురించి విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏవో నర్సిరెడ్డి,ఆర్కిడ్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్, సరిత, కర్ణ రాకేష్ లు పాల్గొన్నారు.

చిరువ్యాపారులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-కోదాడరూరల్

చిరువ్యాపారులను లక్ష్యంగా లోన్ ఇస్తామంటూ మోసం చేస్తున్న నకిలీ పేటీఎం ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌కు దేహశుద్ధి చేసిన ఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి పేటీఎంలో మీకు లోన్ అప్రూవల్ అయింది అని చెప్పి వారి వద్ద నుండి మొబైల్ ఫోన్ తీసుకొని లోన్ అప్రూవల్ చేసి వెళ్లి కొంత సమయం తర్వాత మరలా వచ్చి మొబైల్‌కు మెయిల్ వచ్చింది.చెక్ చేయా లని చెప్పి వారి వద్ద నుండి మొబైల్ ఫోన్ తీసుకొని అమౌంట్‌ను తన అకౌంట్‌లో వేసుకుంటున్న నకిలీ పేటీఎం సేల్స్ ఎగ్జిక్యూటివ్...ఇలా ఇద్దరు వ్యక్తులు వ్యాపారుల నుండి పేటీఎం లో లోన్ అప్రూవల్ చేస్తా అని వారి అకౌంట్స్ నుండి ఆరు లక్షల రూపాయలు తన అకౌంట్ కి మార్పిడి చేసుకున్నారు. వీరిలో ముఖ్యంగా అనంతగిరి మండలం మొగలాయి కోట గ్రామానికి చెందిన సాయిరెడ్డి మిద అనుమానం వచ్చి నిలదీయడంతో అక్కడినుండి పారిపోదామని ప్రయత్నించగా నకిలీ పేటీఎం సేల్స్ ఎగ్జిక్యూటివ్‌ను పట్టుకొని చిరు వ్యాపారులు దేహశుద్ధి చేసి పట్టణ పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులను వివరణ అడుగగా కేసు నమోదు కాలేదని తెలిపారు.



బాధిత యువతిని బంగ్లాదేశ్‌కు చేర్చిన పోలీసులు

నవతెలంగాణ-కోదాడరూరల్

వ్యభిచార గృహంలో కట్టుబడిన యువతి బంగ్లాదేశ్ చెందిన బాధిత యువతీ అని తెలిసి కోర్టు వారి ఆదేశాల మేరకు మన దేశానికి పోలీసులు పంపించిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి నెలలో పట్టణంలోని బంజరుకాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పట్టణ పోలీసులు వ్యభిచార గృహంపై దాడి చేసి వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలు ఇద్దరు పురుషులు, ఒక విటుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. వ్యభిచార గృహం నుంచి రక్షించబడిన బాధిత యువతి వివరాలు తెలుసుకోగా ఆమె బంగ్లాదేశ్ దేశస్తురాలని తెలిసినది.సదరు బాధిత యువతిని కోర్టు వారి ఆదేశాల ప్రకారం ప్రజ్వల హోం హైదరాబాద్ నందు రక్షణ నిమిత్తం ఉంచి బాధిత యువతి తన స్వదేశానికి వెళతానన్న కోరిక మేరకు ప్రజ్వల హోం అధికారులు , పట్టణ పోలీసుల ఉమ్మడి కార్యాచరణతో బంగ్లాదేశ్ దేశ అధికారులతో సంప్రదించి తగు ఏర్పాట్లు చేసి గురువారం పట్టణ ఇన్‌స్పెక్టర్ రాము, ప్రజ్వల హోం సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎండి సిరాజ్‌ల ఆధ్వర్యంలో బాధిత యువతిని ఇండియా-బంగ్లాదేశ్ సరిహద్దు వద్ద బంగ్లాదేశ్ దేశ అధికారులకు అప్పజెప్పారు.



ఆయిల్‌ఫామ్ సాగుతో లాభాలు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

ఆయిల్‌ఫామ్ పంటలో అంతర పంటలతో లాభాలు పొందవచ్చని గడ్డిపల్లి కేవికే శాస్త్రవేత్త అరిగేల కిరణ్ అన్నారు.మండల పరిధిలోని లింగాల గ్రామంలో బత్తిని అంజయ్య క్షేత్రంలో ఆయిల్‌ఫామ్‌లో అంతర పంటగా వేరుశనగను పరిశీలించారు.ఆయిల్‌ఫామ్ తోటలో మొక్కల మధ్య దూరం ఎక్కువ కనుక తొలి 3 సంవత్సరాల కాలంలో అంతర పంటలు పండించి ఆదాయం పొందవచ్చన్నారు.ఆయిల్ ఫామ్ తోటలలో మొక్కజొన్న, అరటి, పొద్దుతిరుగుడు, పొగాకు, మిరప, పసుపు, పూలు, పెసలు, మినుము, అలసందలు, నువ్వులు, వేరుశనగ మరియు కూరగాయ పంటలను అంతరపంటలుగా చేసుకొనవచ్చని తెలిపారు.వరిని అంతర పంటగా చేయరాదని తెలిపారు.నేలసారంతో పాటు ఆదాయం పెరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త మాధురి, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-గరిడేపల్లి

మండలపరిధిలో ఎన్నికల నియమ నిబంధనలను అన్ని రాజకీయ పార్టీల నాయకులు తప్పకుండా పాటించాలని ఎస్సై పి.వెంకట్‌రెడ్డి అన్నారు.గురువారం ఆయన మాట్లాడుతూ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా శాంతియుతంగా జరిగేలా సహకరించాలన్నారు. గ్రామాల్లో అక్రమ లావాదేవీలు జరిగనట్ల సమాచారం తెలిస్తే పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు.ఆధారాల్లేకుండా పెద్ద ఎత్తున నగదు తరలించిన కట్టుబడినచో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
శుక్రవారం | అక్టోబర్ 13, 2023 | www.navatelangana.com

'16న ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయండి'

నవతెలంగాణ-వలిగొండ



ఈనెల 16వ తేదీన భువనగిరిలో జరుగు ప్రజా ఆశీర్వాద సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ హాజరవుతున్నందున ప్రజలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి తెలిపారు గురువారం మండల కేంద్రంలోని దేవిశ్రీ ఫంక్షన్ హాల్లో ముఖ్య కార్యకర్తల సన్నాక సమావేశం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో చేసిన అభివృద్ధిని కార్యకర్తలు ఇంటింటికి తిరిగి చెప్పాలన్నారు కార్యకర్తలు నాయకులు సమన్వయంతో పనిచేసి టిఆర్ఎస్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు మూడవసారి భువనగిరి ఖిల్లా పై గులాబీ జెండా ఎగుర వేయాలన్నారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలేరు అసెంబ్లీ స్థానం ఎస్సీకి కేటాయించాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు అసెంబ్లీ 97 జనరల్ స్థానాన్ని ఎస్సీకి కేటాయించాలని ఆలేరు మాజీ శాసనసభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ కుడుదుల నగేష్ కోరారు. గురువారం ఢిల్లీలోని ఏఐసీసీ హెడక్వాటర్స్‌లోని అల్ ఇండియా ఎస్సి డిపార్మెంట్ చైర్మెన్ రాజేష్ తిలోతీయని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిలోతీయ, ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధి, మొదటి నుంచి రాహుల్ గాంధీ డాక్టర్ నగేష్ వైపై ముగ్గు చూపుతున్నారని ఈ విషయంలో సానుకూలంగా ఉన్నారని, చేవెళ్ల ఎస్సి, ఎస్టీ డిక్లరేషన్ ప్రకారం అమలు చేస్తామని, ఆయా నియోజకవర్గల్లో అన్ని కులాల వర్గాలకు అనుకూలంగా ఉండీ ప్రజలకు సేవచేసే అభ్యర్థుల కోసం కాంగ్రెస్ పార్టీ రాడికల్ స్టెప్ తీసుకుంటున్నదని డాక్టర్ నగేష్ కు మద్దతు ఇస్తాము న్యాయం చేస్తాము అని రాజేష్ తిలోతీయ హామీ ఇచ్చారని తెలిపారు.

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే ఖర్చు చేయాలి



● జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నవతెలంగాణ-భువనగిరి రూరల్

ఎన్నికలలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార కార్యక్రమాలకు ఉపయోగించే వస్తువులు, వాహనాలకు సంబంధించి ఎన్నికల కమిషన్ సూచించిన ధరలకు మాత్రమే ఖర్చు చేయాలని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు ఎ. భాస్కరరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. గురువారం నాడు ఆయన తన ఛాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార కార్యక్రమాలకు ఉపయోగించే లౌడ్ స్పీకర్స్, పోడియం, ఫ్లెక్సీ బ్యానర్లు, క్లాత్ బ్యానర్లు, ఫ్లాగ్స్, పోస్టర్స్, హెూర్డింగ్స్, కటౌట్స్, వీడియోగ్రఫీ, పెన్ డ్రైవ్స్, క్యాసెట్లు, స్వాగత తోరణాలు, వాహనాల కిరాయిలు, డ్రైవరు బత్తాలు, హెూటల్ రూమ్స్ కిరాయిలు, ఫర్నీచర్, రవాణా ఛార్జీలు, చైర్స్, సోఫాలు, టెంట్స్, కార్పెట్స్, సైడ్ వాల్స్, వాటర్ డ్రమ్స్, టీ టిఫిన్, భోజనాలు, సామాగ్రి, విద్యుత్ బల్బులు, ఫ్యాన్స్, కూలర్స్, క్యాప్స్, స్కార్స్, టవల్స్, ఫోటో ప్రింటెడ్ టీషర్ట్స్, ఫంక్షన్ హాల్ కిరాయిలు, వాల్ రైటింగ్స్, కోలాటాలు, డప్పు, డ్రోన్ కెమెరా, ఎల్.ఇ.డి. స్క్రీన్స్, హైడ్రోజన్ బెలూన్స్, వాటర్ బాటిల్స్, స్టేజ్ డెకొరేషన్, స్టిక్కర్స్, టూవీలర్ కిరాయిలు, ఇంధన రేట్లు, తదితర ప్రచార వాహనాలకు సంబంధించి ఎన్నికల కమీషన్ సూచించిన రేట్లకు ఖర్చు లోబడి ఉండాలని తెలిపారు. నామినేషన్ ముందు వరకు రాజకీయ పార్టీలు, నామినేషన్ అనంతరం సంబంధిత అభ్యర్థి ఖర్చు లోనికి వెడుతుందని, రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలను తెలియచేయాలని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా సంబంధిత అధికారుల అనుమతులు పొందాలని, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలు తదితర ప్రచార అనుమతుల కోసం సువిధ యాప్ ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేయాలని సూచించారు. అలాగే నిబంధనలను ఉల్లంఘించిన సంఘటనలు, ఫిర్యాదులపై సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని, వంద నిమిషాలలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా కలెక్టరేటులో 24 గంటలు సేవలందించేందుకు 1950 నెంబర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సిపిఎం నుండి బట్టుపల్లి అనూరాధ, బీఎస్పీ నుండి జహంగీర్, బట్టు రామచంద్రయ్య, కాంగ్రెస్ నుండి సయ్యద్ ముల్తానీషా, కె.యాదగిరి, బిజెపి నుండి పి.బలరాం, వివిధ ఎన్నికల విభాగాల నోడల్ అధికారులు సునంద, సుదర్శన్రెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, డిప్యూటీ తహశీలుదారు సురేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు సూచనలు:

నిబంధనల ననుసరించి ఎన్నికల ప్రచార సామాగ్రిని ముద్రించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎ.భాస్కరరావు ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన గురువారం నాడు కాన్ఫరెన్స్ హాలులో ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశమై మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించేటప్పుడు, ప్రచురించేటప్పుడు తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణ కర్త పేర్లు, చిరునామా, సెల్ ఫోన్ నెంబర్లు స్పష్టంగా పైన ముద్రించాలని సూచించారు.



ముద్రించబడిన ప్రతులకు సంబంధించి 3 కాపీలను ప్రచురణ కర్త నుండి పొందిన డిక్లరేషన్‌తో సహా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127(ఏ) ప్రకారం పంపాలని తెలిపారు. జిల్లా లోని ప్రింటింగ్ ప్రెస్సులు ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, మొదలైన వాటి ముద్రణ చేపట్టే ముందు నిర్దేశించిన ప్రోఫార్మాలో సెక్షన్ 127ఏ(2) ప్రకారం ప్రచురణకర్త నుంచి డిక్లరేషన్ పొందాలని, డిక్లరేషన్ పై ప్రచురణకర్త సంతకంతో ధ్రువీకరించబడాలని, దీనిని జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ యజమాని ధ్రువీకరించాలని తెలిపారు. ప్రింటర్ మెటీరియల్ డిక్లరేషనుతో పాటు సూచించిన ప్రొఫార్మాలో ముద్రించిన డాక్యుమెంట్ కాపీల సంఖ్య, సదరు ప్రింటింగ్ పనికి వసూలు చేసిన ధరకు సంబంధించిన సమాచారాన్ని కూడా ప్రింటర్లు అందించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం ప్రింటింగ్ ప్రెస్ యజమానిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వర చారి, డిప్యూటీ తహసిల్దార్ సురేష్, శ్రీకాంత్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాదసభను విజయవంతం చేయండి

● భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-భువనగిరిరూరల్



ఈనెల 16వ తేదీన భువనగిరిలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయ వంతం చేయాలని భువనగిరి ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి కోరారు. గురువారం టిఆర్ఎస్ బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో భువనగిరి పట్టణ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశాన్ని జిల్లా పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈనెల 16 న భువనగిరి పట్టణంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించే ప్రజాశీర్వద సభకి వలిగొండ మండలం నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్, రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ కొల్పుల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు , వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ కంచి మల్లయ్య, మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు, మాజీ పిఎ సి ఎస్ ఎస్ చైర్మన్ బాలారి మధుసూదన్ రెడ్డి , బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి 25వరకు దసరా సెలవులు

నవతెలంగాణ-భువనగిరి రూరల్

దసరా పండుగ సందర్భంగా తెలంగాణలో విద్యాసంస్థలకు సెలవులను ప్రకటించారున. ఈ నెల 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు సెలవులు ఉంటాయని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎవరూ కూడా తరగతులు నిర్వహించరాదని తెలిపారు. నిబంధనలు పాటించని యెడల తీవ్రంగా పరిగణించి నిబంధనల మేరకు శాఖా పరమైన చర్యలు తీసుకొనున్నట్లు తెలిపారు.

ఉద్య ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-భువనగిరి రూరల్

భువనగిరి మండలంలోని అనాజిపురం గ్రామంలో కొసన స్వామి యాదవ్ అనారోగ్యంతో మరణించగా.. ఉద్య సృష్టి కర్త మేకల చంద్ర శేకర్ యాదవ్, ఉద్య ఫౌండర్ మేక లలిత యాదవ్ వెంటనే స్పందించి వారి కుటుంబానికి రూ.10 వేలు తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఇంటిలో పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంభానికి ఉద్య బరోసా ఇస్తూ, తన కుమార్తె భర్త కూడా ఇటీవలే మరణించగా వారి పిల్లల చదువుల బాధ్యత ఉద్య తీసుకుంటుందని తెలిపారు. ఉద్య తెలంగాణ రాష్ట్రం యువజన అధ్యక్షులు బొల్లు నర్సింహా యాదవ్, ఉద్య తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు గుండెబోయిన సురేష్ యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శంచి తన భార్య విజయకి రూ.10 వేల రూపాయలు అందించి తన కుమార్తె ప్రత్యూష పిల్లల చదువు బాధ్యత ఉద్య తీసుకుంటుందని బరోసా ఇచ్చారు, ఈ కార్యక్రమంలో ఉద్య సభ్యులు సింగన బోయిన సత్యనారాయణ, కోసన మల్లేష్, యాదాద్రి జిల్లా శ్రీకృష్ణ కమిటీ అధ్యక్షులు పుట్ట వీరేశం గారు, బాతుక అశోక్, శ్రీరామ్‌శరత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగయ్య

నవతెలంగాణ-భువనగిరిరూరల్



భువనగిరి మండల పరిధిలోని కునూరు గ్రామానికి చెందిన నుచ్చు నాగయ్య యాదవ్‌ను కాంగ్రెస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, చందుపట్ల గ్రామానికి చెందిన చిన్నం శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి ఈ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా నుచ్చు నాగయ్య, చిన్నం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తాము ఎల్లవేళలా కృషి చేస్తామని, తమ నియామకానికి సహకరించిన సంజీవరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, డీసీసీ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, పీసీసీ ప్రధానకార్యదర్శి పోత్నాక ప్రమోద్, భువనగిరి నియోజకవర్గ ఇంచార్జి పంజాల రామాంజనేయులు గౌడ్, చందుపట్ల పీఏసీఎస్ ఛైర్మెన్ ఎంఎల్ఎన్ రెడ్డి, భువనగిరి మండల అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఊదరియాదగిరి ఆశయాలు సాధిస్తాం

నవతెలంగాణ-భువనగిరి



భువనగిరి పట్టణంలో 40 సంవత్సరాల క్రితం సిపిఎం పార్టీ అభివృద్ధి కోసం పార్టీ సిద్ధాంతాల కోసం నిలబడి పోరాడిన వ్యక్తి పూదరి యాదగిరి రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ కొండమడుగు నరసింహ అన్నారు. భువనగిరి పట్టణంలో మొట్ట మొదటిసారిగా సీపీఐ(ఎం)ను నిర్మిస్తూ ప్రజాసంఘాలను వార్డులలో నిర్మాణ చేశారన్నారు పార్టీని బలోపేతం చేసి ఆయన బాటలోనే వరకు యువత సిద్ధాంతాల కోసం పనిచేస్తున్న ఎర్రజెండా రాజ్యం రావాలని రైతు కూలీలు ఏకం చేసి పోరాటాలు నడిపిన నాయకులన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ పట్టణ జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మాటూరు బాలరాజు గారు నాయకులు గద్దె నరసింహ బందే ఎల్లయ్య వల్ల అంజయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన టీఎన్ఎస్ఎఫ్ గణేశ్

నవతెలంగాణ రామన్నపేట

రామన్నపేట నుంచి సర్నేనిగూడెం వరకు తార్ రోడ్, సీసీ రోడ్డుకు ఇరుపక్కల మట్టి పొయ్యిక ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక ఎంపీడీవో కు వివరించిన స్పందించకపోవడంతో ఫోన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ రోడ్డుకు ఇరువైపులా మట్టి పోసి చదును చేయించడం పట్ల టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి నకిరేకంటి గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోస్తేనే మీ గ్రామాలకు బస్సు వస్తుందని ఆర్టీసీ డిఎం తెలిపారని, మట్టి పోసిన విషయాన్ని ఫోన్ ద్వారా డిఎంకు తెలియజేయగా స్పందించిన డిఎం శనివారం నుంచి రామన్నపేట టు చౌటుప్పల్ బస్సు అందుబాటులో ఉంచుతామని తెలిపారన్నారు.

డీడీలు కట్టిన సభ్యులందరికీ గొర్రెలు పంపిణీ చేయాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

యాదాద్రి భువనగిరి జిల్లాలో గొర్ల పెంపకదారులు ఈనెల 10వ తారీఖున డీడీలు కట్టిన గొర్ల కాపరులకు, గొర్ల పంపణి చేయాలనీ, ఉమ్మడి నల్లగొండ జిల్లా గొర్ల కాపరుద్దారుల సహకార సంఘం జిల్లా డైరెక్టర్, జెల్లీ. నర్సింహులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా గురువారం జిల్లా కార్యాలయం లో పశుసంవర్ధక శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో జెసి కార్యాలయాన్ని ముట్టడించామని, పశుసంవర్ధక శాఖ అధికారికి వినతి పత్రం అందజేశామని, పంపిణీకి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమం లో సంఘం సభ్యులు జె. ఉప్పలయ్య, బండెల. సుభాష్, బీరుమాళ్ళు, బాలయ్య, నగేష్ పాల్గొన్నారు.

'గ్రీన్‌గ్రోవ్'లో బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-చౌటుప్పల్



చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని గ్రీన్‌గ్రోవ్ పాఠశాలలో గురువారం బతుకమ్మ వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి బతుకమ్మ ఆటపాటలు ఆడారు. పలువురిని అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ బండి వీణఅనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ప్రకృతి పూలను పూజించే పండుగ బతుకమ్మ అన్నారు. ప్రజలందరికి బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినుల బతుకమ్మ ఆటపాటలతో పాఠశాలలో సందడిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎస్.లక్ష్మీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేసులతో ఉద్యమాలను ఆపలేరు

నవతెలంగాణ-భువనగిరి రూరల్



కేసులతో ఉద్యమాలను ఆపలేరని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ అన్నారు. గురువారం భువనగిరి ఎస్వి హెూటల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై, నిరుద్యోగుల పక్షాన ఉండి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబిసి, మైనార్టీలకు న్యాయంగా దక్కాల్సిన వాటా కోసం అలుపెరుగని పోరాటం చేస్తుంటే ఈ ప్రభుత్వాలు తనపై, సోషలిస్టు విద్యార్థి సంఘ నాయకులపై కక్షపూరితంగా ఒకే నెలలో 6 కేసులు పెట్టిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీసీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకులు తుమ్మేటి మహేష్, ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్, అనిల్, చిన్నం సాగర్, భరత్ పాల్గొన్నారు.

తనిఖీలో పట్టుబడిన రూ.8.4 లక్షలు సీజ్

నవతెలంగాణ-భువనగిరిరూరల్



యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇన్నా డిస్ట్రిక్ట్ చెక్ పోస్టు 7, ఇంటర్ 3 పోస్టులు ఏర్పాటు చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. కోడ్ అమల్లోకి వచ్చిన అప్పటినుంచి ఇప్పటివరకు చేపట్టిన తనిఖీలలో తనిఖీలలో ఏడు పోలీస్ స్టేషన్లకు సంబంధించిన టీములు పాల్గొనట్లు, 74.19 లీటర్ల లిక్కర్ను సీజ్ చేసినట్లు తెలిపారు. లికర్ విలువ 37,253 రూపాయలు , ఈ తనిఖీలలో మొత్తం ఎనిమిది లక్షల 41 వేల 500 రూపాయలను ప్యాషన్ సీజ్ చేసి, 49 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-భువనగిరిరూరల్

నవంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు పాట్నాలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ బాల మల్లేష్ కోరారు. గురువారం బోనగిరి లో ఉన్న సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఉప్పలం ముత్యాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో పేదలకు ఇండ్ల స్థలాలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులైన వారికి ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉప్పల ముత్యాలు, సలిగంజి వీరస్వామి, చెక్క వెంకటేష్, ఏశాల అశోక్, దుర్గయ్య దయాకర్, వెంకటేష్, వెంకటేశంలు పాల్గొన్నారు.

భువనగిరి కేసీఆర్ సభను అడ్డుకుంటాం

నవతెలంగాణ-భువనగిరి



తెలంగాణ ఉద్యమకారులు ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం ఇవ్వకపోవడం ఉద్యమకారునికి 1000 గజాలు కేటాయించకపోవడం పట్ల కేసిఆర్ సభను భువనగిరిలో అడ్డు కుంటామని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం భువనగిరి జిల్లా కేంద్రంలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ఇకపై కేసీఆర్ పై "త్రిశూల" వ్యూహంతో సభను అడ్డుకుంటామని మొదటి దశలో తెలంగాణ ఉద్యమ కారులచేత నిరసన తెలుపుతామని, రెండవ దశలో నిరుద్యోగులచే నిరసన, మూడవ దశ శివసేన కార్యకర్తలు అడ్డుకుంటారని పూస శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమములో, గుండెబోయిన శివ శంకర్, వేముల అనిల్ లుమార్, హీరేకర్ హరికాంత్, దశరధ, శ్రీరాములు, సత్యం గౌడ్ పాల్గొనారు.

30 వరకు చేనేత ఆన్‌లైన్‌లో శిక్షణాతరగతులు

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

తటస్థ చేతివృత్తులకు ఆన్లైన్ వేదిక ద్వారా అందించే శిక్షణా తరగతులు అక్టోబర్ 9 నుంచి 30 వరకు ఎన్ఐఆర్డి ఆధ్వర్యంలోకొనసాగుతాయని ప్రొఫెసర్ ఆకాంక్ష శుక్ల తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 మంది శిక్షణ బృందంతో చేనేత సహకార సంఘాన్ని సందర్శించి సంస్థ ప్రతినిధులతో సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు పోచంపల్లి చేనేతకు ఆన్లైన్ ద్వారా మార్కెటింగ్ విధానం మార్కెటింగ్ జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మార్కెటింగ్ మీద ఆన్లైన్ మార్కెటింగ్ ప్రపంచంలో పోచంపల్లి చేనేత ప్రాచుర్యం కల్పించే దిశగా ఈ అధ్యాయాన్ని కొనసాగించి ఇస్తాన్నామని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద వ్యాఖ్యలు గ్రూపుల్లో పెట్టొద్దు

నవతెలంగాణ- వలిగొండరూరల్

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వివాదాస్పద వ్యాఖ్యలు సోషల్ మీడియా ద్వారా చేయొద్దని ఎస్సై పెండ్యాల ప్రభాకర్ అన్నారు. గ్రూపులలో వచ్చే పోస్టులకు గ్రూప్ అడ్మిన్లదే పూర్తి బాధ్యత అని అన్నారు. వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారం చేస్తే నాన్ బెయిల్ బుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో ఉప్పొంగిన ఉత్సాహం



వేముల వీరేశానికి ఘనంగా స్వాగతం

నవతెలంగాణ రామన్నపేట

ఇటీవల ఏఐసీసీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన స్థానిక మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మొదటిసారిగా గురువారం రామన్నపేట మండలానికి రావడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహం పొంగిపొగిలింది. ఆయనకు ఘన స్వాగతం పలికారు. జై కాంగ్రెస్ జై.. జై కాంగ్రెస్ అనే నినాదాలు మారుమోగాయి. మొదటగా మండలంలోని నిదానపల్లి గ్రామంలో మల్లన్న గుట్టపై ఉన్న దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోగారం, నిదాన్ పల్లి గ్రామాలలో కాంగ్రెస్ నాయకులను కార్యకర్తలు కలుసుకున్నారు పలువురి ఈ సందర్భంగా వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం నీర్నెముల గ్రామం మీదుగా మండల కేంద్రంలోని జేపీ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. మీరు పార్టీలో చేరికతో కొండంత ధైర్యం వచ్చిందని, మరింత నూతన ఉత్తేజంతో పనిచేస్తామని, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నట్లుగా 50వేల పైచిలుక మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బలం అయితే మీరు మాకు ధైర్యం అని రెట్టింపు ఉత్తేజంతో, ఉత్సాహంతో నినాదించారు. జై కాంగ్రెస్ జై జై కాంగ్రెస్ అంటూ పలుమార్లు సభలో నినాదించారు. సుమారు 300 మంది ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. 24 గంటలు అందుబాటులో ఉంటానని, అందరి ఆత్మగౌరాన్ని కాపాడతానని, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తేవాలని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కార్యకర్తలకు పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వేముల వీరేశం అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నియోజకవర్గంలో సమస్యలు తలెత్తకుండా చర్యలు

నవతెలంగాణ-ఆలేరు టౌను



ఆలేరు నియోజకవర్గ స్థాయిలో ఓటర్లకి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అదనపు కలెక్టర్, ఎన్నికల అధికారి జి.వీరారెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జి. వీరారెడ్డి, ఆర్ఓ అడిషనల్ కలెక్టర్ నియోజకవర్గస్థాయి సెక్టోరియల్ రాజకీయ పక్షాలతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మౌలిక సదుపాయాల గురించి, రూట్ ప్లాన్ ,మరియు కమ్యూనికేషన్ ప్లాన్ గురించి వివరించారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో చాలా జాగ్రత్తగా ముందస్తుగా ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవలసిన అవసరం గురించి మాట్లాడారు. రాజకీయపక్షాలు సమస్యలు తలెత్తకుండా, చూడాలన్నారు. ఎసిపి. శివరాంరెడ్డి సమావేశానికి హాజరై శాంతి భద్రతల పరిరక్షణ కొరకు తీసుకుంటున్న అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి ఆలేరు తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆలేరు నియోజకవర్గం పరిధిలోని తహశీల్దారులు వివిధ పార్టీల నాయకులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల మేనిఫెస్టోలో చేనేత అంశాలు చేర్చాలి



నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

రానున్న శాసనసభ ఎన్నికల ప్రణాళికల్లో బీఆర్ఎస్ మేనిఫెస్టోలో చేనేత అంశాలను చేర్చాలని కోరుతూ మండలంలోని పుట్టపాక గ్రామం సర్పంచ్ సామల భాస్కర్ గురువారం మంత్రి హరీష్ రావుకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో చేనేత వస్త్రం పరిశ్రమ వృత్తిలో దాదాపు 20 కులాలు తర తరాలుగా నేతపనిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఈ వస్త్ర పరిశ్రమను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదుకోవాలన్నారు. ప్రతి చేనేకార్మికునికి చేనేత భీమాను వర్తింప చేయాలన్నారు. చేనేత మగ్గాలపై తయారైన నేత వస్త్రాలను నిరంతరం కొనుగోలు చేయాలన్నారు.గుంట మగ్గాల స్థానంలో స్టాండు మగ్గాలను ఇవ్వడంతో పాటుగా జియో ట్యాగ్ ఉన్న వారికి ఆసు యంత్రం లాంటి అనుబంధ యంత్రాలను సబ్సిడీపై అందజేయాలన్నారు.చేనేత కార్మికుల వ్యక్తిగత ఋణాలు రెండు లక్షల వరకు,చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ తదితర అన్ని ఋణాలను అమలు చేయాలన్నారు.చేనేత సహకార సంఘాలలో నూతన సభ్యత్వాలు అందజాలన్నారు. చేనేత వస్త్ర పరిశ్రమలో ఉపయోగించే నూలు, రంగులు, రసాయానాలు,ముడి సరుకుల పైన జిఎస్ టి రద్దు చేయాలన్నారు. చేనేత వృత్తులలో ఉన్న వారికి దళిత బందులానే రూ. 10లక్షలు అంద చేయాలన్నారు.చేనేత కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ధర్నాలు, ఆందోళనలపై చేనేత కార్మికులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తి వేయాలన్నారు. ఈయన వెంట పలువురి చేనేత సంఘం నాయకులు ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవు

- రామన్నపేట ఎస్సై ఎం. లక్ష్మయ్య
- ముమ్మరంగా వాహనాల తనిఖీలు

నవతెలంగాణ-రామన్నపేట

ఎన్నికల షెడ్యూలు విడుదలై ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, ఎవరైనా ఈ కోడ్ ఉల్లంఘనకు పాలు పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై ఎం లక్ష్మయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా వద్ద పోలీస్ బృందంతో కలిసి ముమ్మరంగా వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సరే 50 వేల రూపాయలకు మించి డబ్బుతో ప్రయాణం చేస్తే అట్టి డబ్బుకు తగిన ఆధారాలు చూపాలని లేని పక్షంలో ఆ డబ్బులను సీజ్ చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ బృందం తదితరులు పాల్గొన్నారు.

శంకరాచారి కుటుంబాన్ని పరామర్శించిన జూలకంటి

నవతెలంగాణ-వేములపల్లి



మండల కేంద్రంలోని ఎస్ఎస్పీ క్యాంప్‌లో అనారోగ్యంతో మృతి చెందిన గౌరోజు శంకరాచారి(42) కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి గురువారం సందర్శించి పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియ జేసి రూ.5వేల ఆర్థికసాయం అంద జేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు రొండి శ్రీనివాస్, చౌగోని సీతారాములు, రైతుసంఘం జిల్లా నాయకులు పాల్వాయి రాంరెడ్డి, చిరుమల్ల బిక్షం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రేమాడాల బిక్షం, సీఐటీయూ మండల కన్వనర్ వెంకన్న, పార్టీ నాయకులు సైదులు, శ్రీనివాస్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోనే..

- అధికారంలోకి వచ్చాక ఇబ్బంది పెట్టిన ఏ ఒక్క అధికారిని వదలం
- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని భువనగిరి ఎంపీ, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెనర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. గురువారం కనగల్ మండలం ధర్వేశ్‌పురం, కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. తన పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలిస్తే బీజేపీలోకి వెళ్తున్నాడని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రాణం పోయినా బీజేపీలోకి పోనని, ప్రాణం పోయిన తర్వాత తన శవం మీద కూడా కాంగ్రెస్ పార్టీ జెండానే ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అడుగులకు మడుగులొత్తుతున్న పోలీసు అధికారులను, ఇతర అధికారులను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎట్టి పరిస్థితులలో వదలమని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు, పోలీసులపై తమకు గౌరవం ఉందని ఆ గౌరవాన్ని నిలబెట్టుకొని పనిచేయాలని సూచించారు. లేనిపక్షంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సంగతి చూస్తామని హెచ్చరించారు. ఈ దసరా పండుగను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని అన్నారు. ఆ పండుగ రోజు రావణ కాష్టం మాదిరిలా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని దహనం చేయాలన్నారు. మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ పార్టీపై నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని, సోనియాగాంధీని విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తాను ఏ స్థాయిలో ఉన్న రాజకీయ జీవితం ప్రసాదించిన నల్లగొండ నియోజకవర్గాన్ని మరువ నున్నారు. 6 గ్యారెంటీ స్కీములను కచ్చితంగా అమలు చేసి తీరుతామని తెలిపారు. ఈనెల 15న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మొదటి జాబితాను ప్రకటించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 75 స్థానాలలో విజయం సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీంల కరపత్రాలను ఎంపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అవకాశవాద పార్టీలను ఓడించండి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-దామరచర్ల



వచ్చే ఎన్నికల్లో అవకాశవాద పార్టీలను ఓడించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపనిచ్చారు. దామరచర్లలోని సీపీఐ(ఎం) కార్యక్రమంలో గురువారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1200 మంది ఆత్మ బలిదానాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నట్లు తెలిపారు. స్వరాష్ట్రం ఏర్పాటు చేసుకొని 10 ఏండ్లు కావస్తున్నా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. మాయమాటలు చెప్పి మూడోసారి అధికారంలో రావాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. కాబట్టి ఈ ఎన్నికల సమయంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోసపూరితమైన మాటలను సీపీఐ(ఎం) కార్యకర్తలు ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి వివరించాలని కోరారు. వాడ వాడల సభలు సమావేశాలు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలను తెలిపే విధంగా ప్రతీ కార్యకర్త సమిష్టిగా పనిచేయాలన్నారు. అప్పుడు మాత్రమే ఇలాంటి అవకాశవాద పార్టీలను ఓడించి వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులను గెలిపించు కోవాలన్నారు. కార్మిక, కర్షక సమస్యలను పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు అన్ని సంక్షోభంలో పడ్డాయని చెప్పారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందచేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అందుకోసమే ప్రజలకు పూర్తిస్థాయిలో కార్మిక కర్షక రైతాంగ, మహిళ, విద్యార్థి, ఉపాధి, ఉద్యోగ, రంగ ప్రజలకు అందరికీ న్యాయంగా సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలు అంటే ఈ రాష్ట్రంలో నిర్వహించే ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలను గెలిపించుకోవాల్సిన అవసరం మనకు ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్, మండల కార్యదర్శి వినోద్ నాయక్ సీనియర్ నాయకులు పాపా నాయక్, దయానంద్, ఎర్ర నాయక్, కోటిరెడ్డి, బాల సైదులు, ఖాజా మొహిద్దిన్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఆత్మ గౌరవాన్ని కాపాడుతా

- సోనియా గాంధీ రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది
- అభివృద్ధి కోసం పార్టీ మారి ప్రజలకు చేసింది ఏమిటి ?
- నేను రాజకీయాల్లోకి వచ్చిందే సేవ చేయడానికి
- నకిరేకల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం
- మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం
- వేముల వీరేశంకు ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-రామన్నపేట



కష్టాల్లో కూడ కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలందరిని కాపాడుకుంటూ వారి ఆత్మ గౌరవాన్ని నిలుపుతానని మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జెపి గార్డెన్స్ లో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ నన్ను కాంగ్రెస్ పార్టీ లోకీ ఆహ్వానించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. వివిధ స్థాయిలో పనిచేస్తున్న కమిటీలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. నాతో వచ్చిన క్యాడర్ అంతా మీ వెంట పనిచేస్తుందని, అందరూ కలిసికట్టుగా పనిచేసి నకిరేకల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగిరేద్దామని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని వంద శాతం ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందన్నారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేస్తూ ముందుకు సాగుదాం అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవడానికి మంచి అవకాశం లభించిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఉంటుందని, ఏఐసీసీ ని కూడా సామాన్యులు కలుసుకోవచ్చునన్నారు. ప్రాంతీయ పార్టీలో అలా ఉండదని అధిష్టానాన్ని కలుసుకోవడానికి చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. నాకు క్యాబినెట్ ర్యాంక్ పదవి ఇస్తామని బిఆర్ఎస్ నాయకులు ఆశ చూపారని అవన్నీ అతనికి ఇచ్చుకుండని, గుప్పెడంత ఆత్మగౌరవాన్ని కోరుకుంటున్నాను అని చెప్పానని అన్నారు. నేను మీకు తోడుగా ఉండాలని ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నన్ను పార్టీలోకి ఆహ్వానించారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన, తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలన్నారు. ఐదు సంవత్సరాల పదవి కాలంలో పిల్లాయిపల్లి, దర్మారెడ్డి పల్లి కాలువను పూర్తి చేయకపోగా ఎంతో అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటున్నారని, అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెప్పే ఆ వ్యక్తి నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశాడో చూపాలని ఆయన విమర్శించారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో సోనియా గాంధీ 6 గ్యారంటీ స్కీమ్ లను ప్రజలకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. పరీక్షలు కూడా సరైన పద్ధతిలో పాలకులు నిర్వహించలేదని ఆయన విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర, నాయకులు తాటిపాముల శేఖర్ గౌడ్, పున్న రమేష్, జినుకల ప్రభాకర్, గాదె శోభ రాణి, గోదాసు పృథ్వీరాజ్, మిర్యాల మల్లేష్, ఎండి జమీరుద్దీన్, గర్దాసు సురేష్, పి మల్లారెడ్డి, గంగుల వెంకట రాజా రెడ్డి, ఆకవరపు మధుబాబు, అయ్యాడపు నర్సిరెడ్డి, పూస బాల నరసింహ, పున్న నరసింహ, దేవిరెడ్డి సావిత్రమ్మ, సింగన బోయిన జంగయ్య, అప్పం రామేశ్వరం, జాన్ రెడ్డి, సంగిశెట్టి సుదర్శన్, గంప చంద్రారెడ్డి, సిరిగిరెడ్డి నర్సిరెడ్డి, గోపగొని సహ దేవ్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా సెంటర్ ప్రారంభం



- ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావ్

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా మీడియా సెంటర్, ఎం సి ఎం సి కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక తో కలసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎన్నికల సమాచారం మీడియాకు సెంటర్ ద్వారా అందచేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర చాలా కీలకమని, దేశపాలన, పౌరులకు సేవలు అందించుటలో మీడియా ఫోర్త్ ఎస్టేట్ గా నిలుస్తుందని అన్నారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాకు సంబంధించిన పెయిడ్ న్యూస్, ఫిర్యాదులు వాటి సమస్యలు పరిశీలించడం అలాగే దినపత్రికలలో వచ్చే వార్తలు, ఎలక్ట్రానిక్, కేబుల్ ప్రకటనలు పరిశీలన చేస్తామని అన్నారు. మీడియా సెంటర్ లో సిబ్బంది తో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల వారీగా ఎన్నికల సమాచారాన్ని అందుబాటులో ఉంచుతామని మీడియా ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంతట ఎం.సి.సి. అమలులో ఉన్నదని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డి.పి.ఆర్.ఓ ఏ. రమేష్ కుమార్, డి.ఈ. ఐ ఈ మల్లేశం, సి.పి.ఓ వెంకటేశ్వర్లు, సంక్షేమ అధికారి జ్యోతి పద్మ, ఏ.ఓ సుదర్శన్ రెడ్డి, మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నవతెలంగాణ-భువనగిరి రూరల్



ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్ల యాజమాన్యాలు సిద్ధం కావాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టరు ఎ.భాస్కరరావు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన మిల్లర్లతో సమావేశమై ఖరీఫ్ 2023- 24 ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలని, ఈ సంవత్సరం కొత్తగా బయోమెట్రిక్ ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోళ్ల చేసి అంతే మొత్తాన్ని మిల్లులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోళ్లకు సంబంధించి మిల్లులలో స్థలం, హమాలీలను పెంచుకోవడంపై మిల్లర్లు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత సంవత్సరం సంబంధించి సిఎంఆర్ ఏ మిల్లు ఎంత పెండింగ్ ఉన్నది సమీక్షిస్తూ సిఎంఆర్ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు గోపీకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మిల్లర్ల సంఘ అధ్యక్షులు గంప నాగేందర్, జిల్లా సెక్రటరీ నాగభూషణం, మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎంపీటీసీలు ఛీ కొడుతున్న సీటు వదలని ఎంపీపీ

- కొండాపురం ఎంపీటీసీ చేపూరి యాదయ్య

చండూరు :చండూర్ మండలం లోని 10 మంది ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ ని వ్యతిరేకిస్తున్న 9 మంది ఎంపీటీసీ సభ్యులు ఛీ కొడుతున్న ఎంపీపీ సీటు వదలడం లేదని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గొరిగే సత్తయ్య విమర్శించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ముందు విలేకరులతో ఆయన మాట్లాడారు. చండూర్ మండల ఎంపీపీ పల్లె కళ్యాణి రవికుమార్‌పై మండలంలో 9 మంది ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాసం పెట్టామని ఒక్క ఎంపీటీసీ కూడ లేకుండా ప్రజబలం లేని పల్లె కళ్యాణి రవికుమార్‌కు ఎంపీపీగా కొనసాగే నైతిక అర్హత లేదన్నారు. ఎంపీటీసీలతో బలనిరూపణ చేసుకోలేక కోర్టును ఆశ్రహిచడం మీ ఓటమికి ఇది నిదర్శనం అన్నారు. నాలుగు సంత్సరాల కాలంలో ఎంపీపీ కొనసాగి ఉద్దరించింది ఏమీ లేదని తెలిపారు. నోట్ ఫైల్ సంతకం చేయాలని రెండు నెలలుగా తిరుగుతున్నప్పటికీ సంతకం చేయలేదు, పైగా ఆ ఫైల్ ఎక్కడ వేసిందో కూడా ఆమెకు తెలియడం లేదని చెప్పారు. తక్షణ ఆమె ఎంపీపీ సీట్‌కి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ వల్ల గ్రామాలలో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు అవ్వరి గీత, చేరుపల్లి భాస్కర్, తిప్పర్తి లక్ష్మమ్మ, పల్లె వెంకన్న చేపూరి యాదయ్య,పెందోటి వెంకటమ్మ, కావాలి మంగమ్మ, నాతల వనజ పాల్గొన్నారు.



నలంద పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు..

నవతెలంగాణ-బొమ్మలరామారం

బొమ్మలరామారం మండలంలోని నలంద పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ,దసరా సంబరాలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థలు దీటుగా ప్రవేట్ విద్యాసంస్థలోను బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరై బతుకమ్మ ఆడిపాడారు.సాంస్కృతి ప్రదర్శనాలు నాటక ప్రదర్శనాలు ఆకట్టుకున్నాయి.బతుకమ్మ పండుగ విశిష్టత గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.అనంతరం విద్యార్థులను తంగెడ, గునుగు, మ%శీ%దార, మల్లె తదితర పూలతో,రంగు రంగుల బతుకమ్మను తయారు చేసి బతుకమ్మ ఆడారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కిరణ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ కీర్తి రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రిని హత్య చేసిన కొడుకు

నవతెలంగాణ-పెద్దవూర



కన్న తండ్రిని అతి దారుణంగా కొడుకు హత్య చేసిన సంఘటన నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలంలో జరిగింది. ఎస్ఐ అజ్మీర రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోతునూరు గ్రామానికి బొడ్డు వెంకటయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్దకొడుకు బొడ్డు రాజబాబు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండవ కొడుకు కిరణ్ హైదరాబాద్‌లో అపార్టు మెంటులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ భార్య పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. చిన్నకొడుకు మహేష్ అవివాహితుడు అతను పీఏపల్లి మండలం రూళ్ళపహాడ్‌లో ఉంటున్నాడు. నిందితుడు పెద్ద కొడుకు రాజాబాబు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఐదు సంవత్సరాల క్రితం భార్యతో గొడవలు పడి, భార్య పిల్లలను వదిలేసి ప్రస్తుతం తన తల్లిదండ్రులతో కలిసి గత కొంత కాలంగా పోతునూర్‌లో ఉంటున్నాడు. తరచుగా రాజబాబు తన తల్లితండ్రులతో గొడవలు పడుతూ వారిని ఇబ్బంది పెట్టేవాడు. అదే క్రమంలో ఈనెల 11న బుధవారం ఉదయం 11 గంటల సమయంలో రాజబాబు తన తండ్రి వెంకటయ్య (55) తో మళ్ళీ గొడవపడి అతన్ని రాయితో తలపై కొట్టాడు. అదే సమయంలో రెండు సార్లు ఇంటిముందు సిమెంట్ రోడ్డుపై ఎత్తి బలంగా ఇసిరి వేశాడు. ఈ ఘటనలో వెంకటయ్యకు తలకు గాయమై స్పృహ తప్పి పడిపోయాడు. అతన్ని వెంటనే నాగార్జున సాగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతనిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా బుధవారం సాయంత్రం సుమారు 05 గంటల సమయంలో చనిపోయారు. మృతుడి భార్య వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఒక కూతురు ఉన్నారు. మృతుని పోస్టు మార్టం నిమిత్తం నాగార్జున సాగర్ కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలి

- పట్టణ ప్రాంతాలకు విస్తరించాలి
- దండెంపల్లి సరోజ

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి పట్టణ ప్రాంతాలకు విస్తరింప చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో నల్లగొండ ఎంపీడీవో ఆఫీసులో ఆఫీస్ సూపరిండెంట్ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సరోజ మాట్లాడుతూ బీజేపీ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి కేటాయించిన బడ్జెట్ రెండు లక్షల కోట్లు ఇవ్వాలని, రోజుకు 600 రూపాయలు కూలి ఇవ్వాలని, కూలీలకు కూలి బందు పథకం ఇవ్వాలని, పని ప్రదేశంలో ఏ వ్యక్తి అయినా చనిపోయిన వారికి నష్టపరిహారం 10 లక్షలు ఎక్స్‌గ్రేషన్ ఇవ్వాలని, వారికి వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ పథకాన్ని విస్తరింప చేయాలని, రెండు వందల రోజులు పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు, వితంతువులకు, ఎస్సీ, ఎస్టీ తరగతులకు ప్రత్యేక పనులు పెట్టడానికి చట్టంలో నిబంధనలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కట్ట అంజయ్య, కార్యదర్శి గోలి నర్సింహ, పట్టణ ఉపాధ్యక్షులు తేలకలపల్లి శ్రీను, సహాయ కార్యదర్శి పనస చంద్రయ్య, దండెంపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

డెక్కన్ సిమెంట్స్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-పాలకవీడు

మండలపరిధిలోని భవానిపురం డెక్కన్ సిమెంట్స్ కర్మాగారంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు యాజమాన్యం తెలిపింది.కర్మాగారం స్కూల్ ఆడిటోరియంలో ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 3.30 నిముషాల వరకు, రివర్ హాస్పిటల్స్, మిర్యాలగూడ డాక్టర్ల చే ఆరోగ్యం పై అవగాహన కలిగించే కార్యక్రమం చేస్తున్నామన్నారు.ఉచితంగా చర్మవ్యాధులు, ఎముకలు, గుండె సంబంధ, స్త్రీ సంబంధ, సాధారణ వ్యాధుల పరీక్షలు చేసి వాటికి తగిన మందులను ఉచితంగా ఇస్తామన్నారు.ఈ అవకాశాన్ని సదరు గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని యాజమాన్యంకోరింది.గ్రామాల నుండి రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది.వృద్ధులకు, పిల్లలకు టీ,టిఫిన్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని పేర్కొంది.

పశువులకు సకాలంలో టీకాలు వేయించుకోవాలి

- ఈవో పాశం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

రైతులు తమ పశువులు ఆరోగ్యంగా ఉండే విధంగా పశు వైద్యులను సంప్రదించి వివిధ రకాల వ్యాధులు రాకుండా సకాలంలో టీకాలు వేయించుకోవాలని ఉమ్మడి నల్గొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పాశం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మండలం స్వాములవారి లింగోటం గ్రామంలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులను గర్భ కోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 35 పశువులను గర్భకోశ చికిత్సలు, 150 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు తెలిపారు. మూగజీవాలకు ఎప్పటికప్పుడు పశు వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు, టీకాలు వేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ పృథ్విరాజ్, శ్రవణ్ కుమార్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ గిరిబాబు, గోపాల మిత్రలు ఉదరి వెంకటేష్ మహాజన్, వై.శ్రీనివాస్, ఎం.శంకర్ మదనాచారి, రైతులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-నకిరేకల్

కేతపల్లి మండలం గుడివాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆలకుంట్ల లింగయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో గురువారం స్థానిక పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజలు విసుగెత్తిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో ఆలకుంట్ల సైదులు, ఆలకుంట్ల యాదయ్య, ఆలకుంట్ల ముత్యాలు, కోడిదల వెంకన్న తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జటంగి వెంకట నర్సుతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

దోచుకున్నోనికి దోచుకున్నంత...

- న్యాయం, ధర్మం కాపాడాల్సిన నాలుగవ స్తంభం
- ముసుగు వేసుకొని దోచుకుంటున్న వైనం
- చేసేదొకటి.. అనుసరించేది మరొకటి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్





ఉండేందుకు గూడు లేక ఎన్నో ఏండ్లుగా ప్రభుత్వ స్థలాలలో నివాసం ఏర్పాటు చేసుకుని జీవన సాగిస్తున్న నిరుపేదలకు ఊరట నిచ్చేలా స్థలాల క్రమబద్ధీకరణకు తెలంగాణ సర్కార్ శ్రీకారం చుట్టింది.ఈ మేరకు రంగంలోకి దిగిన అధికార యంత్రాగం సర్వేలు, తనిఖీలు చేపట్టింది.స్థలాల క్రమబద్ధీకరణను పూర్తి చేసింది.అయితే న్యాయం.. ధర్మం కాపాడే 4వ స్తంభం ముసుగు వేసుకున్న కొందరు తప్పుడు ధృవీకరణపత్రాలను సృష్టించి, తమకున్న బలంతో, రాజకీయ నాయకులతో ఒత్తిడి తీసుకువచ్చి అధికారులను తప్పుదోవ పట్టిస్తూ ప్రభుత్వ స్థలాలను దోచుకున్న వైనం వెలుగులోకొచ్చింది. ఇప్పుడు ఈ విషయం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి రాష్ట్ర వ్యాప్తంగా వార్తల్లోకి ఎక్కింది. వివరాలలోకి వెళితే నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 370, 371 లలో గల స్థలాన్ని నాల్గో స్తంభం ముసుగులో కొందరు వ్యక్తులు దోచుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే ప్రభుత్వ స్థలాల క్రమ బద్ధికరన కోసం విడుదల చేసిన జీవో నెంబర్ 58, 59లను ఆసరాగా చేసుకొని ఎలాగైనా స్థలాన్ని ఆక్రమించాలనే దురుద్దేశంతో మున్సిపల్, రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి 13ఏండ్లుగా ఆ స్థలంలో నివాసం ఉంటున్నట్టు తప్పుడు ధ్రువీకరణ పత్రాలను పొందారు. ఎటువంటి విచారణ చేయకుండానే రాజకీయ నాయకుల ఆదేశంతో మున్సిపల్ అధికారులు ఏకంగా ఇంటి నెంబర్లను కేటాయించారు. ఐతే సర్వేనెంబర్ 370, 371 నెంబర్లలోని ఖరీదైన స్థలాలను తక్కువ మొత్తంలో డబ్బులు కట్టించుకొని ఎటువంటి నిర్మాణాలు లేనప్పటికీ వారి పేరున అధికారులు క్రమబద్ధీకరణ చేశారు. ఈ క్రమబద్ధీకరణ ను చక్కదిద్దే పనుల్లో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొనడం విశేషం. అయితే నాల్గో స్తంభం ముసుగులో స్థలాలను ఆక్రమించుకున్న కొందరు సమాజంలో చలామణి అవుతూ చేసేది ఒకటి అనుసరించేది మరొకటి చేస్తున్నారని, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో దోచుకున్నోడికి దోచుకున్నంత అన్న చందంగా ఉందని పలువురు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ...

ఇదేవిషయంపై నల్లగొండ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఘాటుగా స్పందించింది. తప్పుడు క్రమబద్ధీకరణ చేసిన స్థలాలపై వెంటనే విచారణ చేపట్టి క్రమబద్ధీకరణను రద్దు చేయడంతో పాటు సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, స్థలాలు పొందిన వ్యక్తులపై చట్టరిత్యే చర్యలు తీసుకోవాలని గురువారం కలెక్టర్‌ను, అదనపు కలెక్టర్‌ను కోరారు. మొదటగా పీఆర్టీయూ భవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కలెక్టర్‌ను, అదనపు కలెక్టర్‌ను కలిశామని మూడు, నాలుగు రోజుల్లో చూసిన అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని స్థలాల క్రమబద్ధీకరణను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని తెలిపారు.అవసరమైతే కోర్టుకు వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్టు స్పష్టం చేసారు.

నిబంధన ఏం చెబుతోందంటే...

ప్రభుత్వ స్థలం ఆక్రమించుకున్న పేదలకు స్థలాల క్రమబద్ధీకరణ చేసి పట్టాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 58, 59 ద్వారా అవకాశం కల్పించింది. ఆక్రమణదారులు 2014 జూన్ 2 తేదీల్లోపు సంబంధిత స్థలంలో నివాసం ఏర్పాటు చేసుకుని ఉండాలని నిబంధనలను కూడా ప్రభుత్వం సవరించింది.ఆ కటాఫ్ డేట్‌ను 2 జూన్ 2020 వరకు పొడిగించింది.ఎవరైతే ప్రభుత్వ స్థలంలో నివాసం ఏర్పాటు చేసుకుని నివాస ఉంటున్నట్టుగా రుజువు చూపిస్తారో వారికి ఈ క్రమబద్ధీకరణ చేస్తారు.దారిద్రరేఖకు దిగువుగా ఉండి 125 గజాలలోపు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని నివాసం ఉంటున్న పేదలకు జీవో 58 కింద ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తారు.ఇందుకు ప్రభుత్వ స్థలంలో ఇదివరకే ఇంటి నిర్మాణం చేసుకొని నివాసం ఉంటున్నట్టుగా ఆధారం చూపించాల్సి ఉంటుంది. ఇంటి పన్ను, ఇంటి నెంబరు రశీదు, నల్లా పన్ను, విద్యుత్ బిల్లును దరఖాస్తుతో పాటు జత చేయాల్సి ఉంటుంది. వాటితో పాటు రేషన్, ఆధార్, ఓటర్ ఐడి దీనిలో ఏదైనా ఒకటి విధిగా జత చేయాలి. స్థలం 125 గజాల కంటే ఎక్కువ ఉంటే జీవో నెంబర్ 59 ప్రకారం మార్కెట్ ధరను లెక్కిస్తారు. 126 నుంచి 250 గజాల స్థలంకు రిజిస్ట్రేషన్ ధరను 50 శాతం వరకు చెల్లించాల్సి ఉంటుంది.అలాగే 500 గజాలు దాటితే 100 శాతం రిజిస్ట్రేషన్ ధర చెల్లించాలి. 251 నుంచి 500 లోపు గజాలు ఉంటే 75 శాతం, 500 గజాలు దాటితే 100 శాతం చెల్లించాలి.వాణిజ్య అవసరాల కోసమైతే పరిమాణంతో నిమిత్తం లేకుండా రిజిస్ట్రేషన్ ద్వారా డబ్బులను చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుని వెసులుబాటు ఉంది.

ప్రచారం... కలవరం

- పోలింగ్‌కు 50 రోజులే గడువు
- ఆచితూచి అడుగులేస్తున్న పార్టీలు
- ఈనెల చివరిలో జిల్లాకు రానున్న సీఎం కేసీఆర్
- ఖర్చు తడిసి మోపెడవుతుందనే ఆందోళన
- నామినేషన్ల నాటికి వేడెక్కించేలా వ్యూహాలు
- మరోవైపు టికెట్ల వేటలో విపక్ష నేతలు



నవతెలంగాణ-సూర్యాపేట

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఇంకా 50 రోజులే గడువు ఉండడంతో ప్రధాన పార్టీలు ప్రచార పర్వంపై కలవర పడుతున్నాయి. ఆగస్టు 21 వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల జాబితాను విడుదల చేసి రాజకీయ వేడిని రాజేశారు.అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థులు పట్టణాలు, మండలాలు, నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశాలు, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా వాయు వేగంతో గ్రామాలను చుట్టి వచ్చేలా షెడ్యూల్‌ను రూపొందించుకొని కొంత మేర పూర్తి చేశారు. ఓటరు తుది జాబితా విడుదల అనంతరం ఎన్నికల సంఘం ఈనెల 9న షెడ్యూలు విడుదల చేసిన విషయం తెలిసిందే. వచ్చే నెల నవంబర్ 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆ రోజు నుంచి నవంబర్ 10 తేదీలోపు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాలి. అదే నెల 13 న నామినేషన్ ల పరిశీలన, 15 వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అనంతరం నవంబర్ 30వ తేదీన ఎన్నికలు నిర్వహించి, డిసెంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు చేస్తారు. ఇంకా 50 రోజుల గడువు ఉండడంతో ఎన్నికల ప్రచారానికి జిల్లాలోని ప్రధాన పార్టీలు సమాయత్తమవుతున్నాయి.మరో వైపు బతుకమ్మ దసరా పండగలు అడ్డు వస్తుండడంతో గ్రామాల్లో ప్రచారం చేసిన ప్రయోజనం ఉండదనే భావన పార్టీ అభ్యర్థులలో కనిపిస్తుంది. ప్రచార పర్వం అత్యంత ఖర్చుతో కూడు కోవడంతో ఇప్పటి నుండే జరిగే ముమ్మర ప్రచారం ఆర్థికంగా భారమవుతుందనే ఆందోళన నేతల్లో, అభ్యర్థుల్లో నెలకొంది. దీంతో వచ్చే యాభై రోజుల పాటు చేయాల్సిన ఎన్నికల ప్రచారానికి సంబంధించిన వ్యూహ రచనపై పార్టీలు, అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతున్నారు.ఈ క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 29 వ తేదీన కోదాడ, తుంగతుర్తి,31వ తేదీన హుజూర్‌నగర్ లలో జరిగే సభల్లో పాల్గొని జిల్లాలో ఎన్నికల సమర శంఖాన్ని పూరించనున్నారు.వచ్చే నెల రెండో వారం నుండి సభలు ,సమావేశాలతో ప్రచార పర్వాన్ని వేడెక్కించేలా వ్యూహం సిద్ధం చేసుకుంటున్నారు. కేసీఆర్ తన పార్టీ అభ్యర్థులను ప్రకటించి 50 రోజులు కావస్తున్నప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాపై స్పష్టత రావడం లేదు. జిల్లాలోని సూర్యాపేటలో దామోదర్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి ల మధ్య ,తుంగతుర్తి నియోజకవర్గంలో పిడమర్తి రవి,వడ్డేపల్లి రవి,ప్రితం, దయాకర్,జ్ఞానసుందర్ ల మధ్య తీవ్ర మైన పోటీ ఉండడంతో ఆశావహులు, పార్టీ నాయకులు, శ్రేణులలో సందడి కనిపించడం లేదు. ఓవైపు అధికార పార్టీ ప్రచార వ్యూహన్నీ ఖరారు చేస్తూ దూకుడు పెంచుతుండగా ప్రధాన విపక్ష పార్టీ అయినా కాంగ్రెస్ అభ్యర్థుల వడపోత అంటూ కాలయాపన చేస్తుంది.ఎన్నికలకు ఆరు నెలల ముందే అభ్యర్థులను ప్రకటిస్తామని రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లు చెబుతూ వచ్చినప్పటికీ అది అమలుకు నోచుకోలేదు.అదేవిధంగా టికెట్లు ఆశిస్తున్నవారు మాత్రం టికెట్ల వేటలో ఢిల్లీ,హైదరాబాద్‌ల చుట్టూ తిరుగుతున్నారు. కాగా సూర్యాపేటలో బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి జగదీశ్‌రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహిస్తుండగా బీఎస్పీ అభ్యర్థి వట్టెజానయ్యయాదవ్ తరపున ఆయన సతీమణి రేణుక ప్రచారం చేపట్టింది. కాగా కాంగ్రెస్, బీజేపీల నుండి ఇంకా అభ్యర్థులను ప్రకటించక పోవడంతో నియోజకవర్గంలో సందిగ్ధత నెలకొంది. తుంగతుర్తిలో బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్, కోదాడలో బొల్లం మల్లయ్య యాదవ్, హుజూర్‌నగర్‌లో సైదిరెడ్డి లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. అదేవిధంగా కోదాడ,హుజూర్ నగర్‌లలో కాంగ్రెస్ నుండి టికెట్లు తమవే అనే ధీమాతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతి లు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా తుంగతుర్తి, హుజూర్‌నగర్,కోదాడలో బీఆర్ఎస్ అభ్యర్థులు అసమ్మతి నేతలను తట్టుకొని ప్రచారంలో భాగంగా ఒక దఫా నియోజకవర్గాన్ని చుట్టి వచ్చారు.ఇదిగాక ఈ మూడు నియోజకవర్గాల్లో ఉన్న అసమ్మతి, అసంతృప్తి లను చల్లార్చేందుకు మంత్రి జగదీశ్‌రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్ నిర్వహిస్తూ కేటీఆర్ ద్వారా వారికి భరోసా కల్పిస్తున్నారు.50 రోజుల గడువు ఉండడంతో ప్రచారంతో పాటు మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి చేరువ కావాలనే దృక్పథంతో కేసీఆర్ ఈనెల 15 న అభ్యర్థులకు బీఫామ్‌లు ఇచ్చి దశదిశా చూపనున్నారు.ఇదిలా ఉండగా నామినేషన్ల ప్రక్రియ మొదలయ్యేందుకు ఇంకా 20 రోజుల వ్యవధి ఉండడంతో ఇప్పటి నుండే ఆర్భాటం అవసరమా అనే ధోరణి విపక్ష పార్టీలో ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్నికల ప్రచారానికి కేవలం 20రోజుల వ్యవధి సరిపోతుందని ఎక్కువ రోజులు కొనసాగితే ఖర్చు తడిసి మోపెడవుతుందనే భయం, ఆందోళన అన్ని పార్టీలతో పాటు పోటీ చేసే అభ్యర్థులలో ఏర్పడనుంది. దసరా పండుగ తర్వాత నవంబర్ మొదటి వారం వరకు ఆర్భాట ప్రచారాల జోలికి వెళ్లకుండా ఆ తర్వాతనే వేగం పెంచాలనే యోచనలో అధికార పార్టీతో పాటు విపక్షాలు ఉన్నట్లు స్పష్టమవుతుంది.



బీర్ల ఐలయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పై ఉన్న నమ్మకంతో వివిధ పార్టీల నుండి పెరికల్ ముమ్మర మయాయని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి , వివిధ పార్టీలకి చెందినవారు, ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో వివిధ మండలాలు, గ్రామాల నుండి, కాంగ్రెస్ పార్టీ లోకి చేరికలు జరిగాయన్నారు.యాదగిరిగుట్ట పట్టణంలో సీనియర్ బిఆరెస్ పార్టీ నాయకుడు , పిఎసిఎస్, వైస్ చైర్మన్ కాటబత్తిని ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారని పేర్కొన్నారు.ఆత్మకూరు మండలం పోతిరెడ్డిపల్లి,బ బొమ్మాలరామారం మండలం లక్ష్మీతాండ, చౌదరిపల్లి,మోటకొండూరు మండలంలోని,కొండాపూర్ గ్రామాల నుండి, గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామం,రాజపేట మండలం నమిలే, పాముకుంటా గ్రామాల నుండి సుమారు 2000మంది కాంగ్రెస్ లోకి పార్టీలోకి ఆహ్వానించడం జరిగిందన్నారు.

కాంగ్రెస్‌లో మాజీ సర్పంచ్ చేరిక

నవతెలంగాణ-సూర్యాపేట రూరల్



బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ అరాచక పాలనకు విసిగి బీఆర్ఎస్ రామచంద్రపురం గ్రామ మాజీ సర్పంచ్ బొడ్డు మల్లయ్యతో పాటు కొంతమంది నాయకులు, కార్యకర్తలు గురువారం కాంగ్రెస్‌లో చేరారు.సూర్యాపేట మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామంలోని గ్రామ సర్పంచ్ మండల్‌రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేశ్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ లో చేరారు.ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డిమాట్లాడుతూ కాంగ్రెస్ గెలుస్తుందనే భయంతో మంత్రి జగదీశ్‌రెడ్డి ఒకే రోజు 19 కుల సంఘాలకు శంకుస్థాపన చేశారని ఆరోపంచారు.సూర్యాపేటలో కాంగ్రెస్ 50 వేల మెజార్టీతో గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ 60 నుండి 70 స్థానాల్లో గెలుస్తుందని అనేక సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. సూర్యాపేట ఎమ్మెల్యేగా ఎవరికి టిక్కెట్ వచ్చినా అందరూ కలిసి పార్టీ విజయం కోసం కలిసి పని చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'పాలకవర్గాల మోసపూరిత వాగ్దానాలకు ప్రజలు మోసపోవద్దు'

నవతెలంగాణ-నకిరేకల్



పాలకవర్గాల మోసపూరిత వాగ్దానాలకు ప్రజలు మరోసారి మోసపోవద్దని న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు డేవిడ్ కుమార్ కోరారు. గురువారం స్థానిక యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో ఆ పార్టీ, ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కినారన్నారు. తొమ్మిదేళ్లలో నిరుద్యోగం, దారిద్ర్యం, ఆకలి చావులు, ధరల పెరుగుదల, రైతులు ఆత్మహత్యలు, మహిళలపై దాడులు పెరిగిపోయాయన్నారు. కార్పొరేట్‌కు రాయితీలు, ప్రజలపై పన్నుల భారం మోపి దేశ సంపదను కొల్లగొట్టారన్నారు. రాష్ట్రంలో దళిత ముఖ్యమంత్రి మొదలుకొని రైతు రుణమాఫీ వరకు, డబల్ బెడ్రూం నుండి మూడెకరాల భూమి వరకు అన్ని ఆచరణలో అమలు కానీ హామీలు ఇచ్చి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు సాగర్, అఖిల భారత రైతు-కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు జ్వాల వెంకటేశ్వర్లు, అంబటి చిరంజీవి, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పజ్జూరి ఉపేంద్ర, పి.వై.ఎల్ జిల్లా అధ్యక్షుడు మామిడోజు వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ నాయకులు సిలువేరు జానయ్య, అంబటి వెంకటేశం,రావుల లింగయ్య, పసుపులేటి సోమయ్య, చెరుకు సైదులు, బూరుగు సత్తయ్య, వేముల శంకర్ పాల్గొన్నారు.



విలేకర్ల ముసుగులో ప్రభుత్వ భూమి క్రమబద్ధీకరణపై చర్యలు

- జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి
- విచారించి చర్యలు తీసుకుంటానన్న కలెక్టర్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాల విషయంలో పెద్దన్న పాత్ర పోషించేందుకు వెళ్లి తమ సొంత ప్రయోజనం చూసుకొని సమస్త జర్నలిస్టులకు అన్యాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నల్లగొండ సమస్త జర్నలిస్టులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరణ జిఓ 59 పేరుతో జర్నలిస్టుల ముసుగులో కొందరు ప్రధాన పత్రిక జర్నలిస్టులు తప్పుడు ధృవీకరణ పత్రాలతో ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరణ చేసిన విషయమై విచారణ జరిపి రద్దు చేయాలని, సీనియర్ జర్నలిస్ట్ కోటగిరి దైవాదీనం, టీయూడబ్ల్యూ ఐజేయూ జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి, టీయూడబ్ల్యూ 143 జిల్లా అధ్యక్షులు గుండగోని జయశంకర్‌గౌడ్ కోరారు.గురువారం స్థానిక పీఆర్టీయూ భవన్‌లో యూనియన్‌లకు అతీతంగా జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీ సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.అనంతరం జర్నలిస్టుల ముసుగులో 59 జీఓ నియమాలను తుంగలో తొక్కి భూమిని కాజేసిన 11 మంది జర్నలిస్టులపై జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు.అక్రమంగా ప్రభుత్వ భూమిని కాజేసిన వారి వివరాలను ఫిర్యాదు వెంట జతపరిచామని వెంటనే విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.ప్రభుత్వ నిర్ణయం మేరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని తప్పుదోవ పట్టించి నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 370, 371లలో కొందరు వ్యక్తులకు రెవిన్యూ, మున్సిపల్ అధికారులు 13 ఏండ్లుగా ఆయా సర్వే నెంబరులో నివాసముంటున్నట్లు తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి మున్సపల్, రెవెన్యూ అధికారుల సహకారంతో రాజకీయ నాయకుల ఆదేశాలకు తలొగ్గి ఇంటి స్థలాలను కేటాయించుకున్నారని ఆరోపించారు. జాబితాలో తహశీల్దార్ బంధువులు, ఎంఎల్ఎ అనుచరులు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందని, ఆ స్థలంలో ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణం లేకుండానే ఇంటి నెంబరు కేటాయించారని వెంటనే తప్పుడు క్రమబద్ధీకరణపై విచారణ జరిపి, రద్దు చేయడంతో పాటు దానికి బాధ్యులైన రెవిన్యూ, మున్సిఫల్ అధికారులు, సిబ్బందిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రింట్, ఎలాక్రానిక్ మీడియా, ఫొటో, వీడియో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల పేరిట ఎమ్మెల్యే, అధికారులతో చర్చించి చివరకు పది మంది జర్నలిస్టులు తమ సొంత ప్రయోజనం చేకూర్చుకొని జిల్లా కేంద్రంలోని 200మంది జర్నలిస్టుల పొట్ట కొట్టారని అవేదన వ్యక్తం చేశారు.భవిష్యత్‌లో సమస్త జర్నలిస్ట్‌లకు న్యాయం జరిగే వరకూ పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని, అవసరమైతే రాష్ట్ర సంఘ నాయకత్వంతో చర్చించి జర్నలిస్టుల ముసుగులో భూమిని అక్రమంగా క్రమబద్ధీకరణ చేసుకున్న వారిపై చర్యలు తీసుకునే వరకూ ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అవసరమైతే వీరి యజమాన్యాలకు సమగ్రమైన నివేదికతో ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ కర్ణన్ జీవో నెంబర్ 59 ద్వారా జర్నలిస్టుల ముసుగులో ప్రభుత్వభూమిని క్రమబద్ధీకరణ విషయంపై విచారణ జరిపి బాధ్యులపై, అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, బత్తుల ఉపేందర్, నలపరాజు ధర్మేందర్ ఫహీముద్దీన్, అశ్వక్ అహ్మద్, రాతికింది అంజయ్యగౌడ్, పులిమామిడి మహేందర్‌రెడ్డి, నకిరేకంటి శ్రీనివాస్‌గౌడ్, ఎన్నమల్ల రమేష్‌బాబు, మదూరి నరేందర్, కట్ట సుధాకర్, కె.సుధీర్ కుమార్, కోదాటి శ్రీనివాస్, జానయ్య సలీమొద్దిన్, అల్లి మల్లికార్జున్‌యాదవ్, ఉపేందర్, వెంకన్న, ముచ్చర్ల విజయ్, భజరంగ్ ప్రసాద్, ముచర్ల శ్రీనివాస్, దండెంపల్లి రవికుమార్, మధు, జాజాల కృష్ణ, చంద్రశేఖర్, పిట్టల రామకృష్ణ, గుండాల యాదగిరి, పోగుల రమేష్, శ్రీనివాస్, సత్యం, రాజశేఖర్, రెమిడాల మధు, శేఖర్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-నకిరేకల్

కట్టంగూరు మండలం కురుమర్తి గ్రామానికి చెందిన సుమారు వందమంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గురువారం స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉట్కూరి మహేష్, ఇంద్రకంటి రమేష్, ఇంద్ర కంటి శేకర్, కోంపల్లి శంభయ్య, గడగోజు నర్సింహ చారి, ఇంద్రకంటి వీర వెంకటయ్య, చేనగాని అర్వపల్లి, చెనగాని యాదయ్య, గాధరి పిచ్చయ్య, గాదరి ముత్తయ్య, ధార రమేష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం సైదులు, పిఎసిఎస్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ మనెమ్మ వెంకన్న, గ్రామశాఖ అధ్యక్షుడు పొడిశెటి సైదులు, ఉపాధ్యక్షులు అనంతుల లింగయ్య, గండమల్ల అంతయ్య, వంగూరి రాజు, దోనాల కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

'పాత కాంగ్రెస్ క్యాడర్ ఓర్పుతో ఉండాలి'

నవతెలంగాణ-నకిరేకల్



రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తన అవకాశం వస్తుందన్న నమ్మకం ఉందని పాత కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ఓర్పుతో ఉండాలని టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యనిర్వాక కార్యదర్శి దైద రవీందర్ కోరారు. గురువారం మండలంలోని ఒగోడు గ్రామంలో ఆ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఐదు సంవత్సరాల నుండి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ నియోజకవర్గంలో పార్టీని కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకున్నట్లు చెప్పారు. పార్టీ అధిష్టానం పనిచేసిన వారిని గుర్తించి వారికి అవకాశం కల్పిస్తే బంపర్ మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మెన్ గార్లపాటి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు దూలం సోమయ్య గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రంగు వీరయ్య , వార్డు మెంబర్ రాంబాబు, నాయకులు రాచకొండ వెంకన్న, నాగ మహేష్, ఆకుల గోపి, సందీప్, వెంకన్న చంటి, సైదులు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

నవతెలంగాణ-బొమ్మలరామారం



వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్లా ఐలయ్య ధీమా వ్యక్తం చేశారు.బొమ్మలరామారం మండలం చౌదర్ పల్లి, మాచన్ పల్లి, గ్రామాలకు చెందిన పలువురు గురువారం కాంగ్రెస్ లో చేరారు.వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు.అనంతరం ఉప సర్పంచ్ యనగండ్ల వీరేశం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నిరాకుశం పాలనకు ఓటు ద్వారా చరమగీతం పాడాలని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో బీఆర్ఎస్ కు ఓటమి భయం పుట్టుక%శీ%దన్నారు.దళిత, బీసీ బంధు, గృహలక్ష్మి పేరుతో ఓటు వేయించుకునేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని, ఆలేరులో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, మోకు మధుసూదన్ రెడ్డి,జిల్లా కార్యదర్శి సాయికుమార్, చంద్రశేఖర్, గోపికృష్ణ ,జంగారి లక్ష్మయ్య గౌడ్, వట్టిపల్లి సుదర్శన్,కోడిమాల బాల్ రెడ్డి, గుర్రం సత్తిరెడ్డి, ఫకీర్ రంగారెడ్డి, రఘులు, చెరుపల్లి సాగర్ రెడ్డి, ముత్తిరెడ్డి, నారాయణరెడ్డి, దాసరి రాంరెడ్డి,బాలకృష్ణ గౌడ్, ప్రశాంత్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'ఎంపీపీగా కొనసాగే అర్హత లేదు'

చండూరు : చండూర్ ఎంపీపీగా పల్లె కళ్యాణికి కొనసాగే అర్హత లేదని పలువురు ఎంపీటీసీ సభ్యులు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుండగా తేల్చి చెప్పారు. ఎంపీపీగా ఉండే అర్హత, నైతి హక్కు లేదని చెప్పారు. తన ఎంపీటీసీలలోని ఒక సీనియర్‌గా ఉన్న వ్యక్తిని ఎంపీపీగా నియమిచ్చుకుంటామని, అప్పుడే సర్వసభ్య సమావేశం నిర్వహించుకుంటామని పలువురు ఎంపీటీసీలు చెప్పారు. నాలుగు సంవత్సరాలుగా ఎంపీటీసీలకు గౌరవం ఇవ్వడం లేదని, తమ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, తమని ఏనాడు కూడా పట్టించుకోవడంలేదని ఎంపీటీసీలు మండిపడ్డారు. నోట్ ఫైల్ మీద సంతకం పెట్టమంటే రెండేళ్లుగా తిప్పించుకున్నారని, పైగా ఫైల్ ఎక్కడ వేసారో తెలియలేదన్నారు. ఎంపీపీ పట్ల గ్రామాలలో పూర్తి సహకారం ప్రజలతో ఉండలేకపోతున్నామని, అభివృద్ధి పనులు కూడా చేయలేకపోతున్నామని విమర్శించారు. ఎంపీపీ తక్షణమే మాకొద్దు అంటూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దొడ్డి దారిన కోర్టు స్టే తెచ్చుకోవడం అవివేకమన్నారు. దీంతో ఎంపీటీసీలు మాకు ఎంపీపీ వద్దంటూ సభ నుండి బయటకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో అపరిశుభ్రత వల్ల 8 డెంగీ కేసులు పెరిగిపోయాన్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యుడు రాజు సభలో తెలిపారు. దీంతో పలు శాఖల అధికారులు ఎజెండాతో చదువుకుంటూ వెళ్లారు. ఇది ఏమైనా సర్వసభ సమావేశం అంతంత మాత్రమే కొనసాగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్నాటీ వెంకటేశం, ఎంపీడీవో యాకూబ్‌నాయక్, తహసిల్దార్ రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

పట్టణంలోని అభ్యాస్ స్కూల్లో గురువారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినిలు ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆడి పాడి అలరించారు. బతుకమ్మ విశిష్టత గురించి ఆ పాఠశాల చైర్మన్ వంగాల నిరంజన్ రెడ్డి, కరస్పాండెంట్ వంగాల పుష్పలత వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ

సెయింట్ జాన్స్ పాఠశాలలో..

పట్టణంలోని సెయింట్ జాన్స్‌హై స్కూల్లో బతుకమ్మ పండుగ సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. బతుకమ్మలను రంగురంగుల పూలలతో పేర్చి ఆటపాటలతో అలరిచ్చారు. పూలలతో పాఠశాల ఆవరణ హరివిల్లుగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతికగా పండగ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీష, ఉపాధ్యాయులు భవాని, పద్మ, సుజాత, పరమేశ్వరి, నాగలక్ష్మి, నాగిరెడ్డి, వరప్రసాద్, లోకేష్, మల్లికార్జున్, రవి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మునుగోడు

వేములపల్లి : మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో కలిసి గురువారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. అనంతరం హెచ్ఎం శారద మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక ఈ పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో రజిత, రోజ, ఏఎన్ఎం శైలజ, ఆశా లక్ష్మీ, తల్లులు సంధ్య, సరిత, స్వరూప, సైదమ్మ, సౌజన్య పాల్గొన్నారు.

చిట్యాలటౌన్ : చిట్యాల కేంద్రంలోని ఆక్స్‌ఫార్డ్ పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. రేపటినుండి దసరా సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో చివరి పని దినం రోజున బతుకమ్మ వేడుకను అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యార్థులు రంగురంగుల పూలతో కనువిందు చేసే బతుకమ్మలను తయారుచేశారు. సాంప్రదాయబద్ధమైన దుస్తులను అలంకరించుకొని బతుకమ్మ పాటలను పాడుతూ కోలాటాలు వేస్తూ బతుకమ్మల చుట్టూ ఆటలు ఆడారు. బతుకమ్మ విశిష్టత గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ గడ్డం విశ్వనాథ్, ప్రిన్సిపల్ పెద్ది నరేందర్, ఉపాధ్యాయులు ఆనంద కుమార్, పెద్ది పద్మ, శమీ మున్నీసా బేగం, యాకారి యాదయ్య, బి.కన్నయ్య, ఎస్.జ్యోతి, ధనలక్ష్మి, రమాదేవి, సుధారాణి, మౌనిక, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : మండల పరిధిలో గాంధీజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగని, తెలంగాణ రాష్ట్రంలో సంస్కృతి, నాగరికత, సాంప్రదాయాలు ఉట్టిపడేలా జరుపుకునే పూల పండుగే బతుకమ్మని తెలిపారు. తదుపరి పాఠశాల ఆవరణలో విద్యార్థులు బతుకమ్మలనుపెట్టి, బతుకమ్మ పాటలు పాడి, కోలాటాలు ఆడి, నృత్యాలు చేసి బతుకమ్మ పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్లు కర్నాటి నాగరాజు, సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ బందనాధం సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చండూరు : స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలోని సన్ షైన్ పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న మాట్లాడారు. విద్యార్థులు పూలతో బతుకమ్మలను పేర్చి ఆటా పాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నాంపల్లి

కృష్ణవేణి స్కూల్లో....

స్థానిక చండూరునందు గల కృష్ణవేణి పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు బతుకమ్మను రంగు రంగుల పువ్వులతో అలంకరించి బతుకమ్మ పాటలతో అల్లరించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవర్త గొట్టిపర్తి చంద్రశేఖర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌కే.మహబూబ్ అలీ, వైస్ ప్రిన్సిపాల్ జీ.మిల్కీ రాజు, ఇంఛార్జి స్వప్న, సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాంధీజీలో ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు...

చండూరు మున్సిపాలిటీ పరిధిలో గాంధీజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు బతుకమ్మలను పెట్టి, బతుకమ్మ పాటలు పాడి, కోలాటాలు ఆడి, నృత్యాలు చేసి బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ చెరిపెల్లి రామయ్య, ఏఎస్ఎన్. మూర్తి, కట్టెకోల వెంకటరావు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

గీతా విద్యాలయంలో...

స్థానిక గీతా విద్యాలయంలో గురువారం ముందస్తు బతుకమ్మ సంబురాలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ సంబురాలలో భాగంగా తీరొక్క పూలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మల పేర్చి అన్నింటిని ఒకచోట చేర్చి బతుకమ్మ ఆటపాటలతో ఆనందంగా పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ పోలోజు నరసింహచారి డైరెక్టర్ కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిరేకల్ : మండలంలోని పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు సందడిగా నిర్వహించారు. సాంప్రదాయ వస్త్రాలు ధరించిన విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి ఆడిపాడారు. అమ్మాయిల ఆటపాటలతో పాఠశాల ఆవరణం కోలాహాలంగా మారింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వంటల వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు టి.నర్సింహమూర్తి, సిహెచ్.నరసయ్య, సుష్మ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

హలియా : స్థానిక టైం పాఠశాలలో బతుకమ్మ మరియు దసరా సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల డైరెక్టర్ మంద నరేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లి తండ్రులు ఉపాధ్యయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునుగోడు : మునుగోడు మండల కేంద్రంలోని ఎస్ ఎస్ ఆర్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఆ పాఠశాల కరస్పాండెంట్ మాధగోని అనురాధ ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఉపాధ్యాయునిలు విద్యార్థులతో కలసి బతుకమ్మలను ఏర్పాటు చేసి బతుకమ్మ పాటలతో నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ అనురాధ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మాధగోని బిక్షం గౌడ్ , ఉపాధ్యాయులు జై నరసింహ, ఎస్.లింగస్వామి, బీ. కోటేశ్వర, బీ. లింగస్వామి, పి.విద్యాసాగర్ , ఈ .వల్లి , ఎన్.కళ్యాణి, ఎం.మౌనిక, వై.భాగ్యలక్ష్మి, సిహెచ్.ఝాన్సీ, డి.అంబిక, జి. అశోక్ , ఎస్‌కే. షమీం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులదే

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ఎన్నికలు సక్రమంగా జరిపించవలసిన బాధ్యత అధికారులదే అని జిల్లా కలెక్టర్ ఆర్‌వీ. కర్ణన్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని ఉదయాదిత్య భవన్లో ఆర్‌వోలు, ఏర్వోలు, సెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెక్టార్ అధికారులు సందర్శించిన పోలింగ్ స్టేషన్ల వివరాలు, రూట్ ల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఇంకా పోలింగ్ స్టేషన్లలో మహిళలకు, పురుషులకు టాయిలెట్ సౌకర్యం విధిగా ఉండాలన్నారు. అందులో భాగంగా ఏమైనా మరమ్మత్తులు చేయాల్సివస్తే స్థానిక పంచాయతీ, మున్సిపల్ అధికారులతో చేయించాలని అర్వోలను ఆదేశించారు. సెక్టర్ అధికారులు తరచూ పోలింగ్ స్టేషన్లను సందర్శించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి లో భాగంగా గతంలో రెండు సాధారణగా ఎన్నికలలో జరిగిన సంఘటనలు, నియమావళి ఉల్లంఘన తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతము ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఎవరైనా అధికమిస్తే వెంటనే పరివేక్షించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్లో కమ్యూనికేషన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందులో భాగంగా పోలింగ్ అధికారి ఒకవేళ ఫోన్ నెంబర్ కలవకపోయినా, సిగ్నల్స్ లేకపోయినా, ఇతర సాంకేతిక కారణాలతో ఆ సమయంలో ఫోన్ పని చేయనప్పుడు స్థానిక ప్రభుత్వ కార్యాలయానికి సంబంధించిన ఫోన్ నెంబర్, బి ఎల్ ఓ సెల్ నెంబర్ గాని, ల్యాండ్ లైన్ గాని లేదా స్థానిక పాఠశాలకు సంబందించిన వి కాంటాక్ట్ లో నమోదు చేసుకోవాలన్నారు. 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ఫామ్ 12 డి ద్వారా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన 5 రోజుల లోపు రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని అన్నారు. వివి ప్లాట్లు, ఈవిఎమ్, కంట్రోల్ యూనిట్ల పై సెక్టార్ అధికారులను ఎలా పనిచేస్తాయి అని అడిగి తెలుసుకున్నారు. రూట్లవారిగా అవసరమైన వాహనాలకు సంబంధించి తగిన ప్రణాళికలు రూపొందించి చర్యలు తీసుకోవాలని ఆరోలను కోరారు. ఆర్వోలు ఎన్నికల అధికారులు సిబ్బందికి ఐడి కార్డులను అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌ఓలు, హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, రవి, చెన్నయ్య, శ్రీరాములు, దామోదర్, ఎంసీసీ నోడల్ అధికారి హరి సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

నవతెలంగాణ-నాంపల్లి

మండల కేంద్రంలోని అంగన్వాడీ పాఠశాలలో గురువారం పెద్దాపురం గ్రామ ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలు ఇందిర ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కీళ్ల నొప్పులు, వాత రోగములు, అజీర్తి, మలబద్ధకం, శ్వాస సంబంధిత వ్యాధులకు ఉచితంగా మందులు అందజేశారు. అదేవిధంగా కళ్ళ కలకలు రాకుండా ఉచితంగా హోమియోపతి మందులు అందజేసి ఆయుర్వేద కరదీపికలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి ఇందిర, రాంరెడ్డి, వెంకమ్మ పాల్గొన్నారు.

ఎంపీపీ నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



ఎంపీపీసూదిరెడ్డి నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పుట్టిన రోజు వేడుకల సందర్భంగా నల్గొండ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ బండ నరెందర్ రెడ్డి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నార్కట్ పల్లి ఎంపీటీసీ పుల్లెంల ముత్తయ్య , దుబ్బాక శ్రీదర్ , ప్రజ్ఞపురం రామకృష్ణ , చెరువుగట్టు సర్పంచ్ మాల్గ బాలకృష్ణ , నాయకులు గుండె రవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుమలగిరి ఉప సర్పంచ్ చెన్న బోయిన నాగేష్ యాదవ్ వంటల రమేష్ కన్నబోయిన వెంకన్న తదితరులు శాలువా కప్పి సన్మానించారు.

'మాయ మాటలు నమ్మితే మోసపోతారు'

నవతెలంగాణ-ఆలేరు టౌన్

ప్రజలు పాలకుల మాయ మాటలను నమ్మినంతకాలం మోసపోతూనే ఉంటారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్ జనార్ధన్ అన్నారు. గురువారం ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ఇక్కిరి కుమార్ అధ్యక్షతన టిఎన్జీవో భవనంలో ఆ పార్టీ ప్రజా సంఘాలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రజలకు పదుల సంఖ్యలో హామిలిస్తూ ఒకటీ అర అమలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్, పీ వై ఎల్, ఐ ఎఫ్ టి యు, పీ ఓ డబ్ల్యూ, నాయకులు ఆర్.సీత, పద్మ శశిరేఖ, తమ్మడి మాధవి, తమ్మడి ఉమా, బేజాడి కుమార్, చిర బోయిన. రాజయ్య, పిన్నపురెడ్డి రాఘవరెడ్డి, పద్మ. సుదర్శన్, సాదుల శ్రీకాంత్, గుండు బిక్షపతి, తమ్మడి అంజయ్యా, వంగాల నర్సింహారెడ్డి, కర్రె స్వామి, శిఖిలం వెంకటేష్, తమ్మడి రమేష్, ఆర్.ఉదయ్, ఊరడి. రామచంద్రు, కొమ్మిడి గోపాల్ రెడ్డి, తమ్మడి. మీనయ్య పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

కేసు నమోదు మద్యం సీజ్

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని ఎల్లారెడ్డి గూడెం గ్రామంలో గురువారం బెల్ట్ షాపులపై స్థానిక పోలీసులు రైడ్ చేసి రెండు షాప్‌లలో సుమారు 10 లీటర్‌ల మద్యం సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని స్థానిక ఎస్సై సైదా బాబు పేర్కొన్నారు.



టీఎస్పీఎస్సీపై చీటింగ్ కేసుకు ఫిర్యాదు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

ఇటీవలే నిర్వహి ంచిన గ్రూప్ 4 పరీక్షలలో బయోమెట్రీక్ తీసుకోకుండా నిర్లక్ష్యంగా పరీక్షలు నిర్వహించిన టీఎస్పీఎస్సీపై కేసు నమోదు చేయాలని కోరుతూ జిల్లా కేంద్రం గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పలువురు విద్యార్థులు గురువారం వన్ టౌన్ సిఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి భైరు ప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పులుసు నాగార్జున , పట్టణ అధ్యక్షుడు శరత్ కుమార్ బీఎస్పీ నల్గొండ నియోజవర్గ ఇంఛార్జి కోల్లుజు వినోద్‌చారి, బొడ్డుపల్లి రామలింగయ్య, జగ్రిపోతుల శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికల జోష్

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

ఆలేరు నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీకి ఇతర పార్టీల నుండి చేరికలతో జోష్ కనిపిస్తుంది.గురువారం ఒక రోజే నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి వందల మంది కార్యకర్తలు ఆ పార్టీలో చేరారు.బిఆర్ఎస్ కు చేందిన ముఖ్యనాయకుడు పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాటబత్తిని ఆంజనేయులు ఆలేరు ఇంచార్జ్ బీర్ల ఐలయ్య సమక్షం లో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారితో పాటు ఆత్మకూరు మండలం పోతిరెడ్డిపల్లి,బొమ్మలరామారం మండలం లక్ష్మీ తండా ,చౌదర్పల్లి,మోటకొండూరు మండలం కొండాపూర్ గుండాల మండలం బండ కొత్తపల్లి రాజపేట మండలం నామిలె పాముకుంట గ్రామాల నుండి వివిధ పార్టీలకు చెందిన సుమారు 2000మంది కార్యకర్తలు పార్టీలో చేరినట్లు బీర్ల ఐలయ్య విలేకరులకు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలేరు గడ్డపై కాంగ్రెస్ జెండా ఏగరడం ఖాయమన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్ ,పట్టణ అధ్యక్షుడు బందారపు బిక్షపతి ,నాయకులు గుండ్లపల్లి భరత్ ముక్యర్ల మల్లేష్,ఆకుల గణేష్ ,గుండు నరసింహ ,కలకుంట్ల శేఖర్ ,కిషోర్ తదితరులు పాల్గొన్నారు.